



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో కిక్కిరిసిన జ్వర పీడితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముత్యాలంపాడు వాసి పద్మావతి



దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు వచ్చిన జ్వరపీడితులు





తెనాలి జిల్లా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

పల్లెకు.. జ్వరం

మంచం పట్టిన గ్రామీణులు

- అంతుపట్టని జ్వరాలతో ఆందోళన
- పట్టణాల్లోనూ ప్రతి ఇంటా పీడితులే
- కిటకిటలాడుతున్న ప్రైవేటు ఆస్పత్రులు
- నొప్పులు, వాపుతో అల్లాడుతున్న ప్రజలు
- జ్వరం తగ్గిన తర్వాతా పీడిస్తోన్న నీరసం
- మలేరియా, డెంగీ జ్వరాలు ఎక్కువగా నమోదు

జ్వరం.. జడిపిస్తోంది. అంతుబట్టని జ్వరాలతో జనం ఆందోళన చెందు తున్నారు. సీజన్‌లో వచ్చే సాధారణ జ్వరాలకు భిన్నంగా ప్రస్తుతం పరిస్థితి ఉండటంతో పీడితుల్లో భయం నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా జ్వరంతో పడకేసింది. పల్లెలు.. పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రతీ ఇంటా జ్వర పీడితులు ఉన్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. మందుల దుకాణాల్లోనూ జ్వరాలకు సంబంధించి మందుల కొనుగోళ్లు గత కొంతకాలంగా అధికమయ్యాయి. జ్వరమని ఆస్పత్రికి వెళ్తే టెస్టుల పేరుతో బాధితులు బలవుతున్నారు. ఇక పల్లెలు జ్వరాలతో మంచం పడుతున్నా.. వైద్య ఆరోగ్య శాఖ తూతూమంత్రంగా శిబిరాలతో సరిపెడుతోందన్న విమర్శలు న్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో జ్వరాలతో మరణాలు కూడా సంభవించాయి. అననుకూల వాతావరణ పరిస్థితులు, అడుగంటిన పారిశుధ్యం, తాగునీరు, దోమలు తదితరాలు ప్రజలను జ్వరాలు పీడిస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని అచ్చంపేట, దాచేపల్లి, బెల్లంకొండ, మాచవరం వంటి ఏటిపట్టు మండలాల్లో జ్వరాల వ్యాప్తి ఎక్కువ గా ఉంది. గుంటూరు నగర పరిధి లోని మురికివాడల్లో కూడా జ్వరాల వ్యాప్తి ఎక్కువ గా కని పిస్తుం ది. బాపట్ల జిల్లాలో చాలా గ్రామాలు జ్వరాలతో మంచం పట్టాయి.

గుంటూరు సిటీ, గుంటూరు(మెడికల్), పిడుగురాళ్ల, దాచేపల్లి, ఆగస్టు 27: ఉమ్మడి గుంటూరు జిల్లా జ్వరంతో అల్లాడిపోతోంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొదట పల్నాడులో మొదలైన జ్వరాలు ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వ్యాపించి పట్టి పీడిస్తున్నాయి. సాధారణ జ్వరంగా ఆరంభమై తీవ్రమైన ఒళ్లు నొప్పులు, దగ్గు, వాపు వంటి లక్షణాలతో జనం ఆందోళన చెందుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా తీవ్ర జ్వరం, దగ్గు తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలతో బాధపడుతు న్నారు. కొందరిలో రోజుల తరబడి 102 డిగ్రీల పైన జ్వరంతోపాటు తలనొప్పి ఒళ్లునొప్పులు కనిపిస్తున్నాయి. విపరీతమైన ఎండ, వేడిమి, ఉక్కపోత.. అంతలోనే వర్షాలతో అంతుపట్టని రీతిలో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలం మొదలైన తర్వాత సీజనల్‌గా జ్వరాలు వస్తూ ఉంటాయి. అయితే కొత్తగా వస్తోన్న జ్వరాలు ప్రజలను మానసికంగా, శారీరకంగా కోలుకోలేని దెబ్బ కొడుతున్నాయి. ఇవి వైరల్ ఫీవర్లు కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే.. ఇంటిల్లిపాదీ వీటికి గురౌతున్నారు. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరం తగ్గుతున్నా, కొంత కాలం వరకు కీళ్ల నొప్పులు పలువురిని వదలటం లేదు. మెజార్టీ రోగుల్లో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్లు చెబుతున్నారు. క్వారీలు ఎక్కువగా ఉండే పల్నాడు జిల్లా పరిధిలోని రెంటచింతల, పిడుగురాళ్ల వంటి చోట్ల మలేరియా కూడా వ్యాప్తి చెందుతుంది. ఇవన్నీ ముందే ఊహించనవి. కానీ ఈ ఏడాది జ్వరాల సీజన్ పూర్తి భిన్నంగా ఉంది. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాల పరిధిలో ఎక్కువ భాగం టైఫాయిడ్, డెంగీ కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఎక్కడికక్కడ స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలు తాత్కాలిక వైద్యం అందించినా జ్వరం, ఒంటినొప్పులు తగ్గకపోవడంతో వారే ప్రైవేటు వైద్యశాలలకు సిఫార్సు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో విస్తృతంగా గన్యా జ్వరాలు కనిపిస్తున్నాయి. ఆయా జిల్లాల్లో ఏ పల్లె చూసినా ఇదే పరిస్థితి. మంగళగిరి నియోజకవర్గం తుమ్మపూడిలో 300 మంది జ్వరాల బారిన పడి మంచం పట్టారు. రెండు నెలలుగా ఇక్కడ జ్వరాలు విజృంభిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలోని అచ్చంపేటలో వందల మంది జ్వరపీడితులు ఉన్నారు.



తెనాలి జిల్లా వైద్యశాల్లో రక్తపరీక్షలకు క్యూలో ఉన్న రోగులు

మలేరియా, డెంగీ కేసులూ ఎక్కువే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ జ్వరాలు కూడా ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. ఒక్కసారిగా తెల్ల రక్త కణాలు పడిపోతుండటంతో బాధితులు తీవ్ర అస్వస్థతకు లోనౌతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్ద మలేరియా, డెంగీ కేసులకు చికిత్సల కోసం బాధితులు బారులు తీరుతున్నారు. డెంగీ బాధితులకు చికిత్స చేసే ఆర్ఎంపీలు వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా చేజారిన తర్వాత పెద్ద ఆస్పత్రికి తరలిస్తున్నారు. దీంతో వారి పరిస్థితి విషమిస్తోంది.



రకరకాల టెస్టులతో గుల్ల..

జ్వరం వచ్చిందంటే చాలు ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు రకరకాల టెస్టుల పేరుతో రోగుల జేబులకు చిల్లు పెడుతు న్నారు. మొదట ఒకటి, రెండు రోజులు స్థానిక మెడికల్ షాపుల్లో మందులు వేసుకున్నప్పటికీ జ్వరం అదుపు లోకి రాకపోవడంతో అప్పుడు ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక ఆ టెస్టులు.. ఈ టెస్టులు అంటూ పలు రకాల టెస్టులతో సుమారు పది వేల రూపాయల వరకు టెస్టులకే ఖర్చు చేయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే అక్కడ సరైన చికిత్స అందదని రోగులు ప్రైవేటు వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ అని నిర్ధారణ అయిన కొందరిలో ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, రోగి పరిస్థితి విషమిస్తోందన్న వైద్యుల మాటలతో రోగి తరపు బంధువులు ఖర్చుకు వెనకాడటం లేదు. ఇదే అవకాశంగా వారు దోచుకుంటున్నారు.



అంతు పట్టని రోగం

ఈ సీజన్‌లో వచ్చిన జ్వరాలు వైద్య, ఆరోగ్య శాఖకు కూడా అంతు పట్టకుండా ఉన్నాయి. తీవ్ర జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు వస్తుండటం చూసి తొలుత చికెన్ గున్యా అనుకున్నారు. కానీ జ్వరం, నొప్పులు, వాపు రావడం చూసి వారికి పరీక్షలు నిర్వహించగా చాలామందిలో చికెన్ గున్యా కాదని తేలింది. అదే నమూనాలను పూణే ల్యాబ్‌కు పంపగా అవి చికెన్ గున్యా జ్వరాలని తేలింది. చికెన్ గున్యా వైరస్ మార్పు చెందిననట్లు వైద్య, ఆరోగ్య శాఖ తేల్చింది. జ్వరం ఇంట్లో ఒకరికి వస్తే వెంటనే మరొకరికి సోకుతుండటంతో అదుపు చే యడం కష్టంగా మారింది. ప్రస్తుతం జ్వరా లు బారిన పడిన చాలా మందికి వంటి మీద దద్దుర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చిన్న గుల్లలు లాగా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. జ్వరాలు తగ్గిన తర్వాత కూడా దద్దుర్లు తగ్గడం లేదు.

దీర్ఘకాలిక రోగుల పరిస్థితి దారుణం

జ్వరం వస్తే షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు, వృద్ధులు కోలుకోవడం కష్టంగా ఉంది. జ్వరం వస్తే వారు పూర్తిగా బలహీన పడుతున్నారు. పది, పదిహేను రోజులకు కూడా నీరసం తగ్గడం లేదని అంటున్నారు. గతంలో వచ్చిన జ్వరాలు వల్ల ఏనాడు ఇంత నరక యాతన పడలేదని బాధితులు తెలిపారు. తీవ్రమైన జ్వరం, నొప్పులు తట్టుకునేందుకని వాడుతున్న పెయిన్ కిల్లర్స్, యాంటీ బయోటిక్స్ కూడా వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పూర్తిగా అవగాహన లేని వ్యక్తులు ఇష్టానుసారంగా మందులు వాడటం వల్ల తర్వాత కాలంలో తీవ్రంగా నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.

30న నరసరావుపేటకు చంద్రబాబు, పవన్

- జేఎన్‌టీయూ కళాశాలలో వన మహోత్సవానికి హాజరు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. సీఎంగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్‌లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సంయుక్తంగా ప్రజలు ముందుకు రానున్నారు. ఇందుకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట వేదిక కానున్నది. మండలంలోని కాకాని వద్ద జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీ వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసికట్టుగా పాల్గొననున్నారు. సీఎం, ఉపముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పర్యటనకు అధికారులు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. హెలిప్యాడ్, సభా స్థలి ఏర్పాట్లపై అధికారులతో వారు సమీక్షించారు. కార్యక్ర మంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, అటవీశాఖ అధికారి రామ చంద్ర రావు,ఆర్డీవో సరోజ, తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు.. అగ్ని పరీక్ష

- విద్యాశాఖ అధికారుల హడావిడితో బెంబేలు
- నేటి నుంచి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష
- ఎమ్మార్సీల నుంచి గంట ముందు పశ్నపత్రాల జారీపై గందరగోళం
- గత ఏడాది ఓఎంఆర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయని అధికారులు



గుంటూరు (విద్య), ఆగస్టు 27: ప్రతి రోజు పరీక్షకు గంట ముందు ప్రశ్నపత్రాలు జారీ.. ఈ ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్ల కోసం వారివారి పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఎమ్మార్సీ, ఎంఈవో కార్యాలయాలకు రావాలి.. అక్కడ ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో సీఆర్పీలు ప్రశ్నపత్రాలు జారీ చేస్తారు.. ఈ ప్రశ్నపత్రాలు లీక్ చేస్తే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయి.. ఇదేదో ఎస్ఎస్ఈ, ఇంటర్ బోర్డు పరీక్షలకు సంబంధించి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. బుధవారం నుంచి 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సెల్ఫ్ ఎసెస్‌మెంట్ పరీక్షకు సంబంధించి విద్యాశాఖ చేస్తున్న హడావిడి. దీంతో ఉపాధ్యాయులు బెంబెలేత్తిపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 425పైగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, మరో 335 వరకు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరీక్ష కోసం ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్లు రూపొందించారు. పోటీ పరీక్షల తరహాలో నిర్వహించే ఈ పరీక్షలకు ప్రశ్నపత్రాలు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు రూపొందించి మండల స్థాయిలోని విద్యా వనరుల కేంద్రానికి పంపింది. అక్కడ నుంచి పాఠశాలల వారీగా ప్రశ్నపత్రాలు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్ళి ప్రశ్నపత్రాలు తీసుకువెళ్లాలి. తొలుత పాఠశాలకు వచ్చి ఇక్కడ ఫెషియల్ హాజరు వేసిన తర్వాతే ఆయా కార్యాలయాలకు వెళ్లి ప్రశ్నపత్రాలను సేకరించాలి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 10 నుంచి 20 శాతం పాఠశాలలు మాత్రమే విద్యావనరుల కేంద్రాలకు సమీపంలో ఉన్నాయి. మిగిలిన పాఠశాలల నుంచి రావాలంటే ఉపాధ్యాయులు సటున 20 నుంచి 45 కిలోమీటర్లు ప్రయాణించాలి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొన్ని గ్రామాలు అయితే 60 కిలోమీటర్లు ప్రయాణిస్తే కానీ మండల కేంద్రాలు రావు. ఈ పరిస్థితుల్లో ఆయా పాఠశాలల నుంచి ప్రశ్నపత్రాల కోసం వెళ్లడం ఎలా సాధ్యమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్షలపై విద్యాశాఖ హడావుడితో ఉపాధ్యాయులకు అగ్ని పరీక్షగా మారిందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అనేకచోట్ల స్కూల్స్ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు ప్రశ్నపత్రాల కోసం వెళ్తే విద్యార్థుల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల పెదకాకాని సమీపంలో ఉపాధ్యాయుల ప్రమేయం లేకున్నా అక్కడ చదివే విద్యార్థులు గాయపడ్డారని క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రశ్నపత్రాలను ఒక రోజు ముందే సీలు వేసి సీఆర్పీలు, విద్యా అసిస్టెంట్లు, కాంట్రాక్టు ఉపాధ్యాయుల ద్వారా పంపిణీ చేయాలని, పాఠశాల స్థాయిలో ఉన్న కమిటీ ద్వారా పరీక్షలు పక్కాగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఓఎంఆర్ షీట్ల పరీక్షలో కుంభకోణం

విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ల ద్వారా పరీక్ష నిర్వహించడంలో పెద్ద కుంభకోణం దాగి ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారి కమీషన్ల కోసం ఓ ఏజన్సీకి ఓఎంఆర్‌షీట్ల బాధ్యతలు కట్టబెట్టారని, ఇందులో అక్రమాలు జరిగాయని సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది జరిగిన ఓఎంఆర్ షీట్ల పరీక్షపత్రాలను ఇప్పటి వరకు మూల్యాంకనం చేయలేదు. ఈ మాత్రం దానికి పరీక్ష పెట్టడం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి సొమ్ములు ఊడ్చేశారు

- బోర్డులు ఏర్పాటు చేయకుండానే నిధులు డ్రా
- ఒక్కో మండలంలో రూ.10 లక్షలపైనే బొక్కేశారు



అద్దంకి, ఆగస్టు 27: గుడ్ గవర్నెన్స్ ఇంటియేటివ్స్(జీజీఐ) నిధులు ఉపాధి సిబ్బందికి కాసులు పంట కురిపించింది. 2019 నుంచి 2024 వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో వివరాలను తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. దీని కోసం ఒక్కో బోర్డుకు 750 నుంచి 1500 రూపాయలు ఖర్చు చేయాలి. ఒక్కో మండలంలో సరాసరిన చేసిన వెయ్యి పనులకు బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ బోర్డుల ఏర్పాటు పేరుతో ఒక్కో మండలంలో రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు జీజీఐ అకౌంట్ నుంచి డ్రా చేశారు. అయితే పనులు చేసిన చోట ఎక్కడా బోర్డులు ఏర్పాటు చేయలేదు. అద్దంకిలో ఇటీవల వరకు గుట్టలుగుట్టలుగా రాళ్లు పడేసి ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హడావుడిగా రాళ్లను ఆయా గ్రామాలకు తరలించినా ఇంకా ఏర్పాటు చేయలేదు. అత్యధిక మండలాలలో అసలు బోర్డులనే తయారు చేయించలేదు. ఆడిట్‌లో మాత్రం అంతా ఖర్చు చేసినట్లు చూపించారు. ఉన్నతాధికారులు లోతైన విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



బల్లికురవలో పడవేసి ఉన్న బోర్డులు రాసే రాళ్లు

చీర్స్.. చీర్స్

- విచ్చలవిడిగా అనధికార బార్లు
- ముడుపులతో పట్టించుకోని అధికారులు



చీరాల, ఆగస్టు 27: గ్లాసుల గలగలలు.. చీర్స్ సందడి.. మద్యపానానికి సకల సౌకర్యాలు.. ఇవన్నీ ఏదో అనుమతి పొందిన బార్లకే పరిమితం కాదు. అధికారులు, రాజకీయ నాయకుల అండ దండ ఉంటే ఎవరైనా.. ఎక్కడైనా అనధికారికంగా ఏర్పాటు చేసుకోవచ్చని చీరాల, పర్చూరు ప్రాంతాల్లో వెలిసిన బార్ అండ్ రెస్టారెంట్లను చూస్తే అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగేందుకు అడ్డాగా అనధికార బార్ అండ్ రెస్టారెంట్లు వెలిశాయి. అధికారులకు ఇవ్వాల్సింది ఇస్తున్నాం. ఇక మమ్మల్ని అడిగేదెవరు.. ఆపేదెవరు అంటూ సంబంధిత నిర్వాహకులు బహిరంగంగా వ్యాఖ్యానించడం విశేషం. ఇంకొల్లు, నూతలపాడు, పూసపాడు అడ్డరోడ్డు, పర్చూరు, మార్టూరు, కారంచేడు ప్రాం తాల్లో అనధికారిక రెస్టారెంట్లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మారినా అనధికారిక బార్ల విషయంలో అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలావారీ మామూళ్లే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి.

మా దృష్టికి రాలేదు

అనధికారిక రెస్టారెంట్ అండ్ బార్లు నిర్వహిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. అనధికారికంగా హైవే పక్కన ఏ హోటల్ లేదా రెస్టారెంట్‌లో మద్యం తాగేందుకు అనుమతి లేదు. అనుమతులు లేకుండా మద్యం తాగేందుకు ఎవరైనా ప్రోత్సహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

\- భుజంగరావు, కర్ణ, ఎక్సైజ్ సీఐలు, పర్చూరు, చీరాల

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



అర్హత వివరాలు: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక వివరాలు: ఐకార్ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)/ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(ఏఐసీఈ) స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏఐఈఈఏ స్కోర్‌కు 70%, అకడమిక్ ప్రతిభకు 30% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం అకడమిక్ ప్రతిభకు 30%; ఏఐఈఈఏ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 70% వెయిటేజీ ఇస్తారు.
- డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ మార్కులకు 10%, పీజీ మార్కులకు 30%, ఐకార్ ఏఐసీఈ స్కోర్‌కు 50%, ఇంటర్వ్యూకి 10% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** సెప్టెంబరు 18 నుంచి 23 వరకు
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు:** సెప్టెంబరు 24 నుంచి 27 వరకు
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 8
- **ఫిజికల్ కౌన్సెలింగ్:** అక్టోబరు 9
- **వెబ్‌సైట్:** angrau.ac.in

దిక్సూచి

SCHOLARSHIP ALERT

Adani Gyan Jyoti

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility: Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only. ● Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.

- Applicants must have passed their higher secondary/pre-university/ intermediate/ CBSE/ ISC or equivalent board exams after 2023.
- Admission must be based on the merit rank from state or national-level entrance exams.
- Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually.
Last Date to Apply: 07-10-2024
Application mode: Online application only
Short Url: www.b4s.in/aj/AGSP5

Reliance Foundation Postgraduate

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility:

- Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
- Must have secured 550 to 1,000 in the GATE examination

OR

- Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
- Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree
Last Date to Apply: 06-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFS10

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000
Last Date to Apply: 04-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/HDFC54

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PlPo4nXతో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

'అమ్మ' అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా

- నటి రేవతిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సిద్ధిఖీ
- మీడియా ఆజ్యం పోస్తోంది కేంద్రమంత్రి సురేశ్ గోపి

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో మలయాళ చిత్రసీమ మరింత వేడెక్కుతోంది. ఆరోపణలతో మొదలై విమర్శలు, ఖండనలు, రాజీనామాలను దాటి వ్యవహారం కేసుల దాకా వెళ్లింది. మంగళవారం మరికొందరు నటీమణులు 'మీటూ' అంటూ ముందుకొచ్చారు. మల్లూవుడ్‌లో తాము ఎదుర్కొన్న వేధింపులను వారు బయటపెట్టగా, ఆధారాలు చూపాలంటూ వారిపై ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు ఎదురుదాడికి దిగారు. ఈ పరిణామాలతో కీలక స్థానాల్లో ఉన్న సినీ ప్రముఖులు సైతం ఆరోపణలకు సమాధానం చెప్పలేక తమ పదవులను త్యజిస్తున్నారు. ఇన్నాళ్లూ చక్కటి అభిరుచితో సినిమాలను తెరకెక్కిస్తూ జాతీయ స్థాయిలో ఖ్యాతిని కూడగట్టుకున్న మలయాళ సినిమా ఇప్పుడు మహిళలపై వేధింపులతో వార్తలతో అపఖ్యాతి మూటగట్టుకుంటోందనేది సగటు ప్రేక్షకుడి ఆవేదన.

మూవీ ఆర్టిస్ట్ అసోషియేషన్ రద్దు

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ నేపథ్యంలో నటుడు





మోహన్‌లాల్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమ్మ(అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కీలక వ్యక్తులపై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా ఆయనతో పాటు మరో 17 మంది సభ్యులు తమ పదవులకి రాజీనామా చేశారు. అలాగే, ఈ చిత్రమండలిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, లైంగిక ఆరోపణల నేపథ్యంలో.. ఇటీవలే దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవి నుంచి వైదొలిగారు. నటుడు సిద్ధిఖీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. తన పరువుకు భంగం కలిగించారని నటి రేవతిపై ఆయన కేరళ డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. మలయాళ చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర మంత్రి సురేశ్ గోపి స్పందించారు. "చిత్ర సీమలో వస్తున్న లైంగిక ఆరోపణల గురించి మీడియా చేస్తున్న ప్రచారం ప్రజలని తప్పుదోవ పట్టిస్తోంది. స్వలాభం కోసం మీడియా ఇలా వాస్తవాలు తెలియకుండా ప్రచారం చేయడం సరికాదు" అని ఆయన అభిప్రాయపడ్డారు.

ముఖం చూపించి మాట్లాడు

నటుడు, 'అమ్మ' జాయింట్ సెక్రటరీ బాబూరాజ్‌పై ఓ జూనియర్ ఆర్టిస్ట్ ఇటీవలే లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను ఆయన మంగళవారం ఖండించారు. "ఎవరైతే నాపై ఆరోపణలు చేశారో.. ముఖం చూపించి మాట్లాడాలని సవాలు విసురుతున్నాను" అని పేర్కొన్నారు. అయితే ఇటీవలే ఓ జూనియర్ ఆర్టిస్ట్ బాబూరాజ్‌పై ఆరోపణలు చేశారు. "బాబూరాజ్.. నన్ను ఓ సినిమాలో ఎంపిక చేశానని.. నా పాత్ర కోసం చర్చించడానికి దర్శకులు, నిర్మాతలు వస్తున్నారని.. తన ఇంటికి పిలిచాడు. తన మాటలు నమ్మి నేను వెళ్లాను. కాసేపటికి ఆయన.. సినిమాలో నీ పాత్ర కోసం చర్చలు జరుగుతున్నాయి.. కాసేపు విశ్రాంతి తీసుకోమ్మని ఓ రూమ్ చూపించారు. నేను రూమ్‌లో ఉండగా బాబూరాజ్ బలవంతంగా లోపలికి దూసుకొచ్చి నాపై లైంగిక దాడి చేశారు" అని ఆ జూనియర్ ఆర్టిస్ తన పేరు వెల్లడించకుండా సోషల్ మీడియాలో ఆరోపించారు.

బెంగాలీ ఇండస్ట్రీలోనూ...

మలయాళ పరిశ్రమలోనే కాదు బెంగాలీ చిత్రసీమలోనూ మహిళలపై వేధింపులు ఉన్నాయని నటి రితాభరి చక్రవర్తి ఆరోపించారు. "నాతోటి నటీమణులు, దర్శక, నిర్మాతలు, హీరోల చేతిలో వేధింపులను ఎదుర్కొన్నారు. బెంగాలీ చిత్రసీమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జస్టిస్ హేమ కమిటీలాంటిదే ఇక్కడా ఏర్పాటు చేయాలి" అని రితాభరి సోషల్‌మీడియాలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు.




నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలి



'ఇంతకుముందు ప్రమోషన్స్‌కు కూడా సమయం కేటాయించాలనే ఆలోచన ఉండేది కాదు. కంటెంట్ సినిమాను చూసుకుంటుందని అనుకొనేవాణ్ణి. అది నిజమే అయినా సినిమాను ప్రేక్షకుల దగ్గరకు చేర్చడం మన బాధ్యత. రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారికి సినిమా గురించి ఆటోమేటిక్‌గా తెలుస్తుంది. రెగ్యులర్‌గా ఫాలో కాని వారు, ఇతర పనుల్లో బిజీగా ఉండేవారికి కూడా సినిమా సమాచారాన్ని అందించాలంటే ప్రమోషన్స్ పెద్ద స్థాయిలో చేయాలి. సినిమాను చూడాలనే ఆలోచన వారికి కలిగించాలి' అన్నారు నాని. ఆయన హీరోగా నటించిన 'సరిపోదా శనివారం' చిత్రం గురువారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నాని మీడియాకు వెల్లడించిన చిత్ర విశేషాలివి.

- ఈ సినిమాలో పాయింట్ చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది. సాధారణంగా నా సినిమాలన్నింటిలో తెలియని బరువుని నేనే మోస్తుంటాను. కానీ ఈ సినిమాలో ఎస్.జె. సూర్య, వివేక్ ఆ బరువు మోశారు. నేను కొంచెం బ్యాక్‌సీట్ తీసుకున్నా. పెర్ఫార్మెన్స్ పరంగా సూర్య ప్రియాంక, మురళీశర్మ.. ఇలా అందరిపై భారం ఉంది.
- ఈ సినిమాలో సూర్య పోషించిన పాత్రకు ఆయన తప్ప మరో ఛాయిస్ లేదు. అద్భుతంగా నటించారు. నా ప్రతి సినిమాకూ దర్శకుడి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌లా పని చేస్తాను. నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటాను. సినిమా రిలీజైన తర్వాత అందరూ హ్యాపీగా ఉన్నారని తెలిస్తే సక్సెస్ అయ్యానని ఫీలవుతా.
- ఈ సినిమాకు 'సరిపోదా శనివారం' అని పేరు పెట్టడానికి ఎమోషనల్ రీజన్ ఉంది. నా ఫేవరేట్ మూమెంట్ అది. సినిమా ప్రారంభమైన ఐదు నిముషాలకు వస్తుంది. స్క్రీన్‌ప్లే, నేరేషన్ చాలా ఎక్సయిటింగ్‌గా ఉంటుంది.

ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం



రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించారు. దర్శకుడు మారుతి సమర్పకుడు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'శివసాయి సినిమాను డీల్ చేసే విధానం అద్భుతంగా ఉంది. నిర్మాత కిరణ్ ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో సపోర్ట్ చేశారు. మారుతితో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం ఇది' అన్నారు. 'వినాయకచవితి రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. పొద్దున్నే పూజ చేసుకుని సాయంత్రం సినిమాకి వచ్చేయండి' అని కోరారు దర్శకుడు శివసాయి. మంచి సినిమా చూశామనే నమ్మకం ఉందనీ, అందరికీ నచ్చుతుందని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

ఆ కళలో ఆరితేరలేదు



నా సినిమాలకు విస్తృత ప్రజాదరణ లభించేలా ప్రచారం చేసే కళలో నేను నిష్ణాతుణ్ణి కాను అని జాతీయ ఉత్తమ నటుడు, కన్నడ హీరో రిషబ్ శెట్టి అన్నారు. ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందిన చిత్రం 'లాఫింగ్ బుద్ధ'. ఈ చిత్రం శాటిలైట్, ఓటీటీ బిజినెస్ పూర్తిగా నిరాశపరిచిందని ఆయన చెప్పారు. 'లాఫింగ్ బుద్ధ' ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ గురించి రిషబ్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రీ రిలీజ్ బిజినెస్ ఆశాజనకంగా లేదు. పెద్ద సినిమాలకు సైతం ఈ విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు, కొన్ని చేదు అనుభవాల దృష్ట్యా కన్నడ సినిమాలను కొనేందుకు ఓటీటీ వేదికలు ముందుకు రావడం లేదు. 'లాఫింగ్ బుద్ధ' చిత్రానికి ప్రీ రిలీజ్ బిజినెస్ జీరో' అని ఆయన చెప్పారు.

కొత్తగా..

వినోదం పంచే ప్రేమగాథ



నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన 'సుందర కాండ' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ మంగళవారం నిర్వహించింది. తన స్వప్న సుందరి కోసం అన్వేషించే క్రమంలో ఆయన పండించిన వినోదం అలరించింది. నారా రోహిత్ మాట్లాడుతూ 'ఇదొక వినూత్న ప్రేమగాథ, నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది' అన్నారు. ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని మా చిత్రం ఇస్తుంది అని దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి చెప్పారు.

దసరాకు సూపర్ హీరో



సుధీర్‌బాబు కథానాయకుడిగా అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. తండ్రీ కొడుకుల ప్రేమ, అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి కావొచ్చింది. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరాకు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

తల్లి మనసుకు అద్దం పట్టే సినిమా



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజ్, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రధారులు. షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శకుడు శ్రీనివాస్ (సిప్పి) చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ను పూర్తి చేస్తామని నిర్మాత ముత్యాల కిశోర్ తెలిపారు.

ఐదు భాషల్లో కొటేషన్ గ్యాంగ్



జాకీ ష్రాఫ్, ప్రియమణి, సన్నీ లియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రలు పోషించిన 'క్యూజీ' చిత్రం ఈ నెల 30న ఐదు భాషల్లో విడుదల కానుంది. తెలుగు వరల్డ్ వైడ్ హక్కుల్ని వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రసన్నకుమార్, దామోదర ప్రసాద్ హాజరయ్యారు. ఇది మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్‌టైనర్ అని వేణుగోపాల్ చెప్పారు. అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని చిత్ర సమర్పకుడు ఎన్టీఆర్ శ్రీను చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో కళింగ



ధ్రువ వాయు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కళింగ'. ప్రజ్ఞా నయన్ హీరోయిన్. సెప్టెంబర్ 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ధ్రువ వాయు మాట్లాడుతూ 'తెలుగులో ఇంతవరకూ రాని కాన్సెప్ట్‌తో 'కళింగ' రూపుదిద్దుకుంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు' అన్నారు. ఈ సినిమాను చాలా వరకూ అవుట్‌డోర్‌లో, ఫారెస్ట్‌లో తీశామనీ, సినిమా అద్భుతంగా వచ్చిందని నిర్మాతలు పృథ్వీ యాదవ్, దీప్తి కొండవీటి చెప్పారు.

నిరుద్యోగి ప్రేమకథ



విప్లవ్ ప్రధాన పాత్ర పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఈసారైనా'. ఉద్యోగం కోసం వెదుక్కుంటున్న ఓ యువకుడు ప్రేమలో పడడం, చివరకు ఉద్యోగాన్ని పొందాడా, ప్రేమలో విజయం సాధించాడా అనేది ఆసక్తికరమని దర్శకుడు విప్లవ్ చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో అశ్విని అయలూరు హీరోయిన్. సంకీర్త్ కొండ సహ నిర్మాత.

యూపీఎస్‌తో రైల్వే డివిజన్‌లో 3,750 మందికి లబ్ధి



రైల్ వికాస్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న డీఆర్ఎం రామకృష్ణ, ఇతర అధికారులు

గుంటూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలుకు నిర్ణయించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) కింద గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 3,750 మందికి లబ్ధి జరుగుతుందని డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. వీరంతా ప్రస్తుతం ఎన్‌పీఎస్‌లో ఉన్నారని అన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఏరాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పథకాన్ని ఇప్పటికే కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని, 2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమల్లోకి రానుందన్నారు. ఈ పథకం విధివిధానాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు స్వాగతిస్తున్నారని చెప్పారు. ఈ స్కీమ్ వలన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కచ్చితంగా పింఛన్ వస్తుందన్నారు. సర్వీసులో 25 ఏళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులకు వారి బేసిక్ వేతనంలో 50 శాతం పింఛన్ వస్తుందని చెప్పారు. ఈ స్కీమ్ కింద కనీస పింఛన్ పొందాలంటే 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలన్నారు. తద్వారా రూ. 10 వేల పింఛన్ పొందడానికి అర్హులౌతారని చెప్పారు. గతంలో ఎన్‌పీఎస్(నేషనల్ పెన్షన్ సిస్టమ్)లో చేరిన వాళ్లు కూడా యూపీఎస్‌లోకి మారవచ్చన్నారు. ఉద్యోగులు కేవలం 10 శాతం చెల్లిస్తే సరిపోతుందనీ, ఎన్‌పీఎస్‌లో 14 శాతం ప్రభుత్వం జమ చేస్తుండగా యూపీఎస్‌లో 18.5 శాతం కంట్రిబ్యూషన్ కింద ఇవ్వనుందన్నారు. సర్వీసులో ఉండగా చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు అమలు చేసే ఫ్యామిలీ పెన్షన్ కింద సంబంధిత ఉద్యోగి పింఛన్‌లో 60 శాతం చెల్లింపు ఉంటుందన్నారు. రిటైర్‌మెంట్ రోజున గ్రాట్యూటీకి అదనంగా 50 శాతం డీఏ చెల్లిస్తామన్నారు. సమావేశంలో రైల్వే గుంటూరు డివిజన్ సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్ బాబు, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నకూతురిపై లైంగిక దాడి

మాచర్లటౌన్, ఆగస్టు 27: కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నబిడ్డ పట్ల ఓ తండ్రి కర్కశంగా ప్రవర్తించాడు. లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ఓ తండ్రి తన ఐదేళ్ల కుమార్తెపై కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని ఆ పాప తన తల్లికి చెప్పడంతో ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో ఇదే మాదిరిగా తన కుమార్తెపై తన భర్త లైంగిక దాడి చేస్తుంటే పుట్టింటికి వెళ్లిపోయాయని, పది రోజుల క్రితమే పెద్ద మనుషులు పంచాయతీ చేసి తిరిగి ఇంటికి తీసుకొచ్చారని ఆ తల్లి పేర్కొంది. పొరపాటు చేయనని మాటిచ్చిన తన భర్త మళ్లీ అదే మాదిరిగా కుమార్తెపై అఘాయిత్యం చేస్తున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు తెలిపారు.

పొలం అమ్మలేదని ఎమ్మెల్యే భర్త అనుచరుల దాడి

- బాధితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- బాధితుడు కమ్మ వెంకట్రావు ఆరోపణ

గుంటూరు, ఆగస్టు 27: రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తనకు నచ్చిన ధరకు పొలం విక్రయించలేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే భర్త గల్లా రామచంద్రరావు అరాచకానికి పాల్పడ్డాడని బాధితుడు కమ్మ వెంకట్రావు ఆరోపించారు. ఆయన ఒత్తిళ్లకు లొంగని కారణంగా తమపై అతని అనుచరులతో దాడి చేయించడమే గాక తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించాడని బాధితుడు వెంకట్రావు వాపోయారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే భర్త రామచంద్రరావు నుంచి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని బాధితులు మంగళవారం గుంటూరు కోర్టును ఆశ్రయించేందుకు వచ్చారు. ఈ వ్యవహారం ప్రస్తుతం టీడీపీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా బాధితులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

చెప్పిన ధరకే అమ్మాలని బెదిరింపులు

క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన కమ్మ వెంకట్రావు పిడుగురాళ్ల సమీపంలో 8 ఎకరాల పొలం కొనుగోలు చేశారు. రోడ్డు ఫేసింగ్‌లో మూడు ఎకరాలు, దానికి పక్కన నాలుగు ఎకరాల 90 సెంట్లు పొలం కొన్నానని వెంకట్రావు తెలిపారు. గతేడాది భ్రమరా టౌన్‌షిప్ అధినేత గల్లా రామచంద్రరావు నాలుగెకరాల 90 సెంట్లు పొలాన్ని కొనుగోలు చేసేందుకు తన వద్ద ఒప్పందం చేసుకున్నాడని వివరించారు. ఎకరం రూ.48 లక్షల చొప్పున కొనుగోలు చేసేందుకు గతేడాది ఏప్రిల్ 4న అగ్రిమెంట్ రాసుకున్నామన్నారు. ఆ రోజున రామచంద్రరావు తనకు రూ. 18 లక్షల చొప్పున 3 చెక్కులు, ఐదు లక్షల నగదు ఇచ్చారని తెలిపారు. అందులో రెండు చెక్కులు బ్యాంకులో బౌన్స్ అవ్వగా. ఒక చెక్కు పాస్ అయిందన్నారు. దీనికి సంబంధించి తనకు కేవలం రూ.23 లక్షలు మాత్రమే ముట్టాయని వెంకట్రావు పేర్కొన్నారు. అయితే తన నుంచి కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్న నాలుగెకరాల 90 సెంట్లతోపాటు రోడ్డు ఫేసింగ్ మూడెకరాల ఏడు సెంట్ల పొలాన్ని కూడా ఆక్రమించేందుకు రామచంద్రరావు ప్రయత్నించాడన్నారు. తాను ఒప్పందం చేసుకున్న పొలంలో నిర్మాణాలు కూడా ప్రారంభించాడన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే అందులో షెడ్డు నిర్మాణం చేయడంతో తాను గురజాల కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసిందని చెప్పారు. కోర్టు ఉత్తర్వులను వారికి అందజేయడానికి వెళ్తే తన వెంట పడ్డారని వెంకట్రావు వాపోయాడు. ఈ వివాదాల నేపథ్యంలో ఎట్టకేలకు రామచంద్రరావు ఈ ఏడాది ఫిబ్రవరి 23న తాను ముందుగా కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్ చేసుకున్న నాలుగెకరాల 90 సెంట్లకు గానూ మూడు ఎకరాల 90 సెంట్లకు పూర్తి మొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. తనకు రోడ్డు ఫేసింగ్‌లో ఉన్న మూడు ఎకరాల పొలంతోపాటు వెనుక వైపు రామచంద్రరావు అగ్రిమెంట్ రాయించుకున్న దానిలో మిగిలిన ఎకరం వెరసి నాలుగు ఎకరాలు తనకే విక్రయించాలని రామచంద్రరావు అడిగారని వివరించారు. అయితే గతంలో లాగా తాను అగ్రిమెంట్ రాయనని, పూర్తి మొత్తం చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని స్పష్టం చేశానన్నారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అవి పూర్తి కాగానే తాను పూర్తి మొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటానని రామచంద్రరావు స్పష్టం చేశాడన్నారు. ఆయన భార్య మాధవి ఎమ్మెల్యే అయిన తర్వాత రామచంద్రరావు షాడో ఎమ్మెల్యేగా అంతా తానై నడిపిస్తూ తాను చెప్పిన ధరకు నాలుగు ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరిస్తున్నాడని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చల్లా రమేష్

రూ.30 లక్షలు ఇస్తాం..

అయితే గత కొంతకాలంగా రామచంద్రరావు అనుచరులు తనను కలిసి మొత్తం రూ. 30 లక్షలు ఇస్తాం, తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరిస్తున్నారని వెంకట్రావు ఆరోపించారు. అందుకు తాను ఒప్పుకోలేదనీ, ఈ క్రమంలో గుండా సుబ్బారావు, కొల్లి సాంబిరెడ్డి, మురళి మరికొందరు తనను కలిసి రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేశారన్నారు. ఎమ్మెల్యే భర్త చెప్పినా వినకపోవడం ఏమిటని బెదిరించారని అన్నారు. ఇటీవల రామచంద్రరావు పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే భర్తకు పుట్టిన రోజు కానుకగా రిజిస్ట్రేషన్ చేస్తావా లేదా అంటూ గట్టిగా తీవ్రంగా బెదిరించారన్నారు. అయినప్పటికీ తాను ఒప్పుకోలేదని వెంకట్రావు పేర్కొన్నాడు. అనంతరం తాము న్యాయవాది మాగులూరి హరిబాబును సంప్రదించగా ఆయన ఐజీని కలసి ఫిర్యాదు చేశారన్నారు. ఆ తర్వాత తాను పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు తీసుకోలేదని హరిబాబు తెలిపారు. కాగా వెంకట్రావుపై దాడి చేసి కొట్టిన వారే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తప్పుడు ఫిర్యాదు చేస్తే బాధితులపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని హరిబాబు వాపోయారు.

వెంకట్రావు ఆరోపణల్లో వాస్తవం లేదు : చల్లా రమేష్

గత వైసీపీ ప్రభుత్వంలో పిడుగురాళ్లలో అక్కడి వైసీపీ నాయకులతో కలిసి కమ్మ వెంకట్రావు చేయని అరాచకం లేదనీ, ప్రస్తుతం వివాదాస్పదమైన స్థలం తనదేనని చల్లా రమేష్ అనే వ్యక్తి స్పష్టం చేశారు. గుంటూరులో కమ్మ వెంకట్రావు, ఆయన కుమారుడు హరికృష్ణపై జరిగిన దాడి, నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుకు సంబంధించి ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం నేపథ్యంలో రమేష్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. పిడుగురాళ్లలో తాను 45 ఎకరాల పొలం కొనుగోలు చేసి దానిని భ్రమరా రియల్ ఎస్టేట్‌కు ఇచ్చానని రమేష్ తెలిపారు. రైతులు వద్ద తాను కొనుగోలు చేసి దానిని భ్రమరా రియల్ ఎస్టేట్‌కు ఇచ్చానని, ఈ క్రమంలో కొందరు రైతులు వద్ద తాను కొనుగోలు చేసిన పొలాన్ని కమ్మ వెంకటరావు వద్ద కొంత మొత్తం ఫైనాన్స్ తీసుకొని దానిని ఆయన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించానని చెప్పారు. ఆయన వడ్డీ వ్యాపారి కావడంతో డబ్బు తీసుకున్నామన్నారు. మొదట్లో రెండు రూపాయలు వడ్డీ అని చెప్పి ఆ తర్వాత పది రూపాయలు వడ్డీ చొప్పున ఇవ్వాలని అడ్డం తిరిగాడన్నారు. అయినప్పటికీ ఆయన అడిగినంత ఇచ్చామని తెలిపారు. అయితే పిడుగురాళ్లలో వైసీపీకి చెందిన ఓ మాజీ జడ్పీటీసీతో కలిసి ఈ వెంచర్‌లో 29 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేసి అందులో వేసిన రోడ్లను ధ్వంసం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థను బ్లాక్ మెయిల్ చేసి డెబ్బతీసే కుట్రకు పాల్పడ్డాడు అన్నారు. భ్రమరా సంస్థ నిర్వాహకులను బెదిరించి ఫైనాన్స్ కింద తీసుకున్న పొలాన్ని సేకరించి మూడు కోట్లు వసూలు చేశాడన్నారు. అదేవిధంగా వైసీపీ నాయకుడు కూడా ఆక్రమంగా మూడు కోట్లు దోచుకున్నాడని అన్నారు. రామచంద్రరావు భార్య ఎమ్మెల్యే కావడంతో అసత్య ఆరోపణలు చేసి రాజకీంగా ఇబ్బంది పెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు.

పోలీసుల సమక్షంలో దాడి జరగలేదు

నాలుగు రోజుల క్రితం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించిన వివాదం పోలీసుల సమక్షంలో జరగలేదని వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేయాలని, కేసు నమోదు చేసినంత మాత్రాన నిందితులు నేరస్తులు కాదని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ ఎస్టీ కేసులను డీఎస్పీ విచారించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో ఆ కేసు తాను విచారించాల్సి ఉందన్నారు. విచారణలో తప్పుడు కేసు అని తేలితే ఫాల్స్‌గా రిఫర్ చేస్తామన్నారు. పోలీసుల సమక్షంలోనే వెంకట్రావుపై దాడి జరిగిందంటూ వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. అంతేగాక వెంకట్రావు నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

నవంబర్‌లో అందుబాటులోకి బైపాస్

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 27: చిలకలూరిపేట బైపాస్ రోడ్డు నిర్మాణం మరో రెండు నెలల్లో పూర్తవుతుందని, నవంబర్‌లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అన్నారు. బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే చిలకలూరిపేటలో ట్రాఫిక్ కష్టాలు, ప్రమాదాలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణపు పనులను జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం చెన్నై నుంచి కోల్‌కతా వెళ్లే 16వ నంబర్ జాతీయ రహదారిపై చిలకలూరిపేట వద్ద బైపాస్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బొప్పూడి నుంచి తిమ్మాపురం వరకు 16.384 కిలోమీటర్ల మేర బైపాస్ రహదారి ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్గంలో 3 చోట్ల ఫైవంతెనలు కూడా నిర్మించారు. బైపాస్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఆరులైన్ల రహదారి ఏర్పాటుతో పాటు బొప్పూడి నుంచి తిమ్మాపురం వరకు ఎడమ వైపు సర్వీసు రహదారి, ఆ పక్కన సైడ్ డ్రైన్, గోడ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రమాదాల నివారణకు తాను మంత్రి ఉండగా ఈ బైపాస్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారి ఉన్నప్పుడు మళ్లీ బైపాస్ రోడ్డు ఇవ్వకూడదని దేశవ్యాప్తంగా ఒక చట్టం చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం 2014-19 మధ్య రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శ్యాంబాబు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి బైపాస్ తీసుకొచ్చినట్టు తెలిపారు. రహదారికి సంబంధించి చేసిన భూసేకరణలో 25 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వమే భరించే తొలి ప్రాజెక్టు దేశంలో ఇదేనని అన్నారు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఉమ్మడిగా ఒక ఖాతా తెరిచి రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లించారని, అందులో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించిందన్నారు. ఈ బైపాస్‌కు ఒక చరిత్ర ఉందని, కేంద్ర మంత్రివర్గంలో ఆమోదం తెలిపిన ప్రాజెక్టు కూడా ఇదేనని పేర్కొన్నారు. గత పాలకులు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, కమీషన్ డబ్బుల కోసం రెండేళ్ల ఈ ప్రాజెక్టును పూర్తిగా గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా బైపాస్ రోడ్డు ను ప్రారంభించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. నేషనల్ హైవేస్ పీడీ పార్వతీశం మాట్లాడుతూ బైపాస్ రహదారి నిర్మాణాన్ని అక్టోబరు 31 నాటికి పూర్తి చేసేలా శరవేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టు మొత్తం వీడియో సర్వైలెన్స్ కోసం ఆటోమేటిక్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏటీఎంఎస్) ఏర్పాటు చేస్తున్నామన్నారు.



చిలకలూరిపేట బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్తిపాటి

1.06 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 27: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.06 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు ఎస్ఈ కె. వెంకటరమణ చెప్పారు. 3 క్రస్ట్ గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 25,876, టీఆర్‌సీ ద్వారా 8,881 మొత్తంగా 34,757 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 35,176 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.39 మీటర్లకు సమానమన్నారు.

30,026 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 27: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. రెండు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 30,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,160 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,394 క్యూసెక్కులు, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 30,026 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 79,260 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 79,260 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బ్యారేజి దిగువకు 18,250 క్యూసెక్కుల నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 27: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 34,788 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 18,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16,538 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాల్ని విస్మరిస్తే చర్యలు తప్పవు

- సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు

గుంటూరు(విద్య), ఆగస్టు 27: సంక్షేమ శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల ప్రణాళికను విస్మరిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు స్పష్టం చేశారు. మంగళవారం జేకేసీ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో ఇప్పటికి 60శాతం మాత్రమే అడ్మిషన్లు పూర్తి అయ్యాయని, నూరుశాతం అడ్మిషన్ల కోసం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పంపిణీ చేసే స్కాలర్‌షిప్‌లు యాప్‌లో అప్‌డేట్ చేయాలని, గ్రామ, వార్డు వెల్ఫేర్ అధికారులను సమన్వయం చేసుకుని ప్రభుత్వం అప్పగించిన బాధ్యతల్ని పక్కాగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇంకా అనేక మంది స్కాలర్‌షిప్ పోర్టల్‌కు లాగిన్ కాలేదని అటువంటి వారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టళ్లలోని విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడవద్దని, నిర్దేశించిన వేళల్లో వార్డెన్లు హాస్టళ్లలోనే ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమశాధికారి రఘు, ఉమ్మడి జిల్లా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, సీవోలు పాల్గొన్నారు.

డీడీ వ్యాఖ్యలపై సంఘం నాయకుల నిరసన

సంక్షేమ శాఖలపై జేకేసీ కళాశాలలో జరిగిన సమీక్ష సందర్భంగా డీడీ మధు సూదనరావు కొంతమంది వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అప్పగించిన పనులు చేయకుండా ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. హెచ్‌డబ్ల్యూవోలు హాస్టల్ ఎంత సమయం గడుపుతున్నారు, విద్యార్థుల భవిష్యత్తు, భద్రత పట్టదా అంటూ కొందరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డీడీ మధుసూదనరావుతో వాదనకు దిగారు. కొద్దిసేపు సమావేశంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ విషయంపై "ఆంధ్రజ్యోతి" డీడీ మధుసూదనరావును వివరణ కోరగా తాను ప్రభుత్వ అప్పగించిన విధుల గురించి మాత్రమే ప్రశ్నించానని, వ్యక్తిగతంగా ఎవర్నీ విమర్శించలేదని స్పష్టం చేశారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీడీ మధుసూదనరావు, పక్కన రఘు

అన్న క్యాంటీన్లకు రూ.5 లక్షల విరాళం



సీఎం చంద్రబాబు నాయుడుకు రూ. 5 లక్షల చెక్కు అందజేస్తున్న తులశమ్మ

గుంటూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లకు గుంటూరు నగరానికి చెందిన విశ్రాంత అధ్యాపకురాలు మేకా తులశమ్మ రూ.5లక్షలు విరాళమిచ్చారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా సుదీర్ఘంగా సేవలందించి ఆమె ఉద్యోగ విరమణ చేశారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి చెక్కు అందజేశారు. అన్న క్యాంటీన్‌కు విరాళం ఇచ్చిన ఆమెను సీఎం చంద్రబాబు అభినందించారు. ఆమె స్ఫూర్తిని కొనియాడారు. తులశమ్మ స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి విరాళం చెక్కును అందజేస్తున్న సత్యనారాయణ

రూ.లక్ష విరాళం

రేపల్లె, ఆగస్టు 27: పేదలకు అన్నం పెట్టేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు చేయూతను ఇవ్వాలనే ఉద్దేశంతో నిజాంపట్నంకు చెందిన నాళం సత్యనారాయణ బుక్‌స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. రూపాయి రూపాయి కూడపెట్టి దాచిన డబ్బుతో అన్న క్యాంటీన్‌కు విరాళం ఇవ్వాలనే దృఢసంకల్పంతో ముందుకు వచ్చారు. నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి రూ.లక్ష చెక్కును విరాళంగా అందించారు. వీరితో పాటు ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు.

కాల్వలోకి దూకిన యువతి కోసం గాలింపు

పిడుగురాళ్ల, ఆగస్టు 27: జూలకల్లు గ్రామానికి చెందిన లంజేపల్లి మనీషా (22) కాల్వలోకి దూకి గల్లంతైన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్ల మండలం, జూలకల్లు గ్రామానికి చెందిన లంజేపల్లి మనీషా ఎస్సీ కాలనీలో నివాసం ఉంటుంది. అదే కాలనీకి చెందిన కొందరు అవమానకరంగా మాట్లాడారని మనస్తాపానికి గురైన మనీషా మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా జూలకల్లు సమీపంలోని గుంటూరు మెయిన్ కెనాల్ వద్దకు వెళ్లి కాల్వ ఒడ్డున చెప్పులు విడిచి, గ్రామానికి చెందిన కొందరు అవమానకరంగా మాట్లాడారని ఓ లేఖ రాసి ఉంచి కాల్వలోకి దూకింది. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న కాలనీవాసులు, పోలీసులు యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

53,075 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 56,464 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 53,075 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 18,202 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16500	334	9000	6500
నెంబరు. 5	8500	13000	నెంబరు.5	9000	9000
273	9000	11800	273	11500	11500
341	9000	16500	341	8800	14000
4884	--	--	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18300	తేజ	9500	18500
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	9500	13500
దేవనూరుడీలక్స్	9000	11500	దేవనూరుడీలక్స్	13000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

గంజాయి, మద్యం, ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయాలి

- ఎస్పీ తుషార్ డూడీ
- ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 27 : జిల్లాలో గంజాయి, మద్యం, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయటానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో గంజాయి, ఇసుక, మద్యం అక్రమ రవాణా కట్టడి చేయటానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి, కేసుల దర్యాప్తు వేగంగా నిర్వహించటానికి, రోడ్డుప్రమాదాలను తగ్గించటానికి తీసుకోవాల్సిన చర్యలు, మిస్సింగ్ కేసులను చేదించే విధానం, ఇతర అంశాలపై పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షించి తగిన సూచనలు, మెళకువలు తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. గంజాయి, మద్యం అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు అంకితభావంతో నిర్వహించాలన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రజలు వారి సమస్యలను వెల్లడించటానికి అవకాశం ఉంటుందన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో, కూడళ్ళల్లో, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రధాన మందిరాల వద్ద, ముఖ్యమైన విగ్రహాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

● ఆలయ హుండీ, ద్విచక్రవాహనాల దొంగతనాల కేసులను చేదించి నిందితులను అరెస్టు చేసి 6.7 కేజీల వెండి, 10 వాహనాలను రికవరీ చేయటలో విశేష కృషి చేసిన సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య, ఐటి కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, చుండూరు పోలీసుస్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ సూర్య ప్రకాష్, పి.వెంకటేశ్వర్లు, కె.చిరంజీవి, సీహెచ్ నవీన్, బి.వాసు, ఎస్.కోటేశ్వరరెడ్డి, కె.రాములను ఎస్పీ తుషార్ డూడీ అభినందించి ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ జి.నారాయణ, డీసీఆర్‌బీ సీఐ బాల మురళీకృష్ణ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సూర్యలంక కేంద్రీయ విద్యాలయాన్ని పరిశీలించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

- ప్రిన్సిపాల్ వైఖరిపై అసంతృప్తి
- నివేదిక సమర్పించాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు


విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న బత్తుల పద్మావతి

బాపట్ల, ఆగస్టు 27 : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మంగళవారం బాపట్ల మండలం సూర్యలంక కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. ఇటీవల కేంద్రీయ విద్యాలయంలో ప్రయోగం వికటించి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం పాఠకులకు విదితమే. ఈ సంఘటన గురించి విచారించేందుకు పద్మావతి విచ్చేశారు. స్థానిక మహిళా శిశు సంక్షేమశాఖాధికారులతో కలిసి తరగతి గదులను పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థులతో ముఖాముఖీగా మాట్లాడి సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రాంగణం పరిశీలించి ఆప్రాంతమంత అడవిని తలపించేవిధంగా ఉందని తరగతి గదులు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లోని డెస్క్‌టాప్స్ పనిచేయటంలేదని గుర్తించారు. తరగతి గదులు మూసి ఉన్నందున వాసన వస్తుందని తెలిపారు. ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు సరిగ్గా పనిచేయటంలేదన్నారు. రూమ్‌లు మొత్తం బూజుపట్టి దుమ్ముకొట్టుకుపోయి ఉన్నాయన్నారు. ఆర్వో ప్లాంట్ పనిచేయని కారణంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ తాగునీటిని అందించటంలేదన్నారు. రికార్డులు చూపించమని అడిగితే జాప్యం చేస్తూ విద్యార్థుల హాజరు మాత్రమే చూపించి మిగతావి లేవని ప్రిన్సిపాల్ చెప్పినట్లు పద్మావతి వివరించారు. పైగా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు కూర్చొనే బెంచీలు విరిగిపోయి ఉన్నాయని, లైబ్రరీని పరిశీలించగా దుమ్ము పట్టి దుర్వాసన వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే ఇన్ని సమస్యలు ఉన్నాయని ఆమె తెలిపారు. అనంతరం ముత్తాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నభోజనం రికార్డులు పరిశీలించారు. నలుగురు విద్యార్థులను డ్రాప్‌అవుట్‌గా గుర్తించారు. వారిలో బాల్యవివాహం జరిగిన కారణంగా స్కూల్‌కు రావటంలేదని తెలుసుకొని బాల్యవివాహాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సీడబ్ల్యూసీ మెంబరు నీలిమా, గుంటూరు సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ ప్రమీల, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.ఉమా, సీడీపీవో పార్వతి, సూపర్‌వైజర్ జ్యోతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.పురుషోత్తంరావు, విజయరోజలిన్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల బ్యానర్ ఆవిష్కరణ

బాపట్ల, ఆగస్టు 27 : జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం బ్యానర్ ఆవిష్కరించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అధికారులతో కలిసి నేత్రదాన ప్రతిజ్ఞ పత్రం విడుదల చేశారు. నేత్రదానం చేయండి చిరంజీవులు కండి, కంటికి కన్ను మీ సంకల్పం, కావాలి నేత్రదానం మనందరికి ఆదర్శం.. ఒకరినేత్రదానం వల్ల ఇద్దరి జీవితాలలో వెలుగులు నింపవచ్చు అని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరు మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలని కలెక్టర్ పి లుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లిలో తెలుగుభాషోద్యమం వారోత్సవాలు

బాపట్ల, ఆగస్టు 27 : మండలంలోని వెదుళ్ళపల్లి చైతన్యభవన్‌లో మంగళవారం తెలుగుభాషోద్యమ వారోత్సవాలను ప్రారంభించారు. ఆధునిక సమాజంలో ఊరూరా తెలుగుభాష అభ్యుదయ సాంస్కృతిక ఉద్యమం ఆవశ్యకత అవసరమని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కళాయాత్ర కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఘంటసాల విగ్రహం కేంద్రంగా 10 మండలాలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్,మిరియాల మరియబాబు, బ్రహ్మారెడ్డి, గునిమినీ బాలయేసు, కోట చిన్నారెడ్డి, వివేక్, శంకర్, వైష్ణవ్, కె.సీతారామిరెడ్డి, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

బుసుక అక్రమంగా తరలిస్తున్న లారీ స్వాధీనం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 27 : చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెం నుంచి మండలంలోని చందోలు వైపు వస్తున్న బుసుక లారీ లోడ్‌తో ఉన్న వాహనాన్ని రెడ్డిపాలెం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో బుసుక లోడ్‌తో ఉన్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని మైనింగ్ అండ్ జియాలజి శాఖకు అప్పగించినట్లు చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. అనధికారికంగా బుసుక, ఇసుక, మట్టి తవ్వకాలు నిర్వహించే వారిపై చట్టపరమైన తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● కొల్లూరు, ఆగస్టు 27 : బుసక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఇసుక అక్రమ రవాణ అడ్డుకునే చర్యల్లో భాగంగా లంక గ్రామాల్లో పర్యటిస్తుండగా బుసక లోడు తో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుకావడంతో దానిని అదుపులోకి తీసుకుని ఎఎస్ఐ అర్జున్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

రేపల్లె, ఆగస్టు 27 : పట్టణంలోని ఫిష్ మార్కెట్ సెంటర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుండి రూ.10,740 స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

కుందేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు

- కలెక్టర్ వెంకటమురళి
- వాగును పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

బాపట్ల, ఆగస్టు 27 : కుందేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి-కావూరువారిపాలెం రోడ్డులో కుందేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం అవసరాన్ని మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. బ్రిడ్జి అవసరాన్ని గుర్తించారు. అనంతరం రాయల్ మెరైన్ ఇంఫెక్స్ కంపెనీని పరిశీలించారు. అక్కడ నుంచి ఎగుమతి అవుతున్న రొయ్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన బ్రిడ్జి నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. 118 సర్వే నెంబరులోని భూమిలో బ్రిడ్జి ఉండటంపై ఆరా తీశారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరటంతో దానిని తొలగించి అదేప్రాంతంలో నూతనంగా బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రూ.5 కోట్లతో ప్రాథమిక అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఆర్ అండ్ బీ ఆధీనంలో బ్రిడ్జి నిర్మించాల్సి ఉందన్నారు. కుందేరువాగు ఆక్రమణకు గురికావటం, వాగు భూమిలోనే కొందరు వ్యక్తులు పంటలు సాగు చేయటంపై కలెక్టర్ ఆరా తీశారు. వాగు పరివాహక ప్రాంతం ఆక్రమణకు గురికాకుండా సర్వే చేసి హద్దురాళ్ళు వేయాలని సంబంధితాధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆర్డీవో గంధం రవీందర్, జలవనరుల శాఖ ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావు, తహసీల్దార్ శ్రీదేవి, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వెదుళ్ళపల్లి -కావూరి వారిపాలెం రోడ్డులో కుందేరువాగుపై బ్రిడ్జి నిర్మాణం అవసరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


బాధితులకు ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థికసాయం అందజేస్తున్న నాయుడు వెంకటనారాయణ

అగ్ని బాధితులకు ఇళ్ల నిర్మాణం చేయిస్తాం

కర్లపాలెం, ఆగస్టు 27 : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధితులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ళ స్థలాలు లేని వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి ఇళ్ళు నిర్మాణం చేపడుతామని, ఇళ్ళ స్థలాలు ఉన్న వారికి గృహాల నిర్మాణం చేస్తామని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏఎస్‌కేఆర్ కేవీ ప్రసాద్ అన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంక కాల్వ కట్టపై నివసిస్తూ అగ్నిప్రమాదంలో గృహాలు కోల్పోయిన బాధితులను పీడీ ప్రసాద్ మంగళవారం పరామర్శించారు. ఇళ్ల నిర్మాణం చేయిస్తామని వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ అన్వర్ బాషా, పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హనుమంత, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాయుడు వెంకట నారాయణ రూ.90 వేల ఆర్థికసాయం

కర్లపాలెంలో అగ్నిబాధితులకు ప్రముఖ ఆక్వా వ్యాపార వేత్త నాయుడు వెంకటనారాయణ ఒక్కొక్కరికి 10వేలు చొప్పున 9 మందికి రూ.90 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, కుంచాల నాగిరెడ్డి, చీరాల శ్రీనివాసరెడ్డి, ఏకసిరి నరసింహ, ధర్మేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు కూరగాయలు, దుస్తుల పంపిణీ

లంక కాల్వకట్టపై సర్వం కోల్పోయిన అగ్ని బాధితులకు ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి శ్రీనివాసరెడ్డిలు దుస్తులను, కూరగాయలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరువీధుల శంకరప్రసాద్, కృష్ణారెడ్డి, కట్టా సుజాత, మద్దాల ముసలయ్య, కుంచాల నాగిరెడ్డి, టి.విజయ్‌కుమార్, కె.చంద్ర, రామకృష్ణ, జీవీ గుప్తా, కూనం లక్ష్మయ్య, కృష్ణమూర్తి, సోమశేఖరరావు, గోపి, బొమ్మిశెట్టి కిరణ్ పాల్గొన్నారు.


అగ్నిబాధితులకు దుస్తులు, దుప్పట్లు...

బాపట్ల, ఆగస్టు 27 : కర్లపాలెం మండల కేంద్రంలోని లంకకాల్వ కట్టపై సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయన 9 కుటుంబాల వారికి వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లానాయకులు చల్లా రామయ్య మంగళవారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పఠాన్ షంషేర్, ఎండి సాధిక్, తాతపూడి మనోహర్, కొక్కిలిగడ్డ రామరాజు, పసుపులేటి అంజి, ఆకురాతి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 27 : మండలంలోని చందోలు గ్రామపంచాయతీలోని ఎస్టీకాలనీలోని మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు కుటుంబాలకు చెందిన పూరిళ్ళు దగ్ధమయ్యాయి. ఈ విషయమై చందోలు-1, 2 వీఆర్వోలు అరుణ ప్రసన్న, పి.అమానుల్లాఖాన్‌లు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న పిట్టలవానిపాలెం తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ అక్కడకు విచ్చేసి బాధితులను పరామర్శించి సంఘటన గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అగ్నిబాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు చొప్పున నగదును అందజేశారు. 20 కిలోల బియ్యం, కందిపప్పు, పంచదార, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ జరిగిన సంఘటన తెలుసుకొని బాధిత కుటుబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున తనవంతు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, టీడీపీనాయకులు పాల్గొన్నారు.

అలాగే బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, జనసేన నాయకులతో కలిసి అగ్నిబాధిత కుటుంబాలను పరామర్శించి మధ్యాహ్న భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎండీ అఫ్జల్

అమరజవాన్ కుటుంబానికి ఆర్థికసాయం

బాపట్ల, ఆగస్టు 27 : జమ్ముకాశ్మీర్‌లో జరిగిన యుద్ధ విన్యాసాలలో పాల్గొని మృతి చెందిన అమర జవాన్ రజ్జుబాషా కుటుంబానికి 50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. మాజీ సైనికుడు కొలసాని వేణు తన మిత్రబృందంతో ఏర్పాటు చేసిన ఈ మొత్తాన్ని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు చేతులమీదగా మంగళవారం అందజేశారు. ఈ విధంగా సాయం చేయటం అభినందనీయమని కొలసాని వేణు మిత్ర బృందాన్ని ఆయన అభినందించారు. మానవత్వంతో స్నేహధర్మాన్ని పాటిస్తూ తమ కుటుంబానికి ఆర్థిక సాయం అందించినందుకు రజ్జుబాషా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొలసాని వెంకట్రావు, పుట్టా ఆదిశేషారెడ్డి, సయ్యద్ అఖిల్, పువ్వాడ యలమంద తదితరులు పాల్గొన్నారు.


అమరజవాన్ రజ్జుబాషా కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికుడు కొలసాని వేణు తదితరులు

టీచర్ల డివిజన్ స్థాయి సర్దుబాటు చేయాలి

బాపట్ల,ఆగస్టు 27 : టీచర్ల సర్దుబాటు మండల స్థాయి గ్రీవెన్స్ పూర్తి చేసిన తర్వాత డివిజన్ స్థాయి సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘాల సమైక్య ఛైర్మన్ బడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ టివి.సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పని సర్దుబాటు ప్రక్రియలో మండల స్థాయిలో గ్రీవెన్స్ పరిష్కారం కాకుండా డివిజన్ స్థాయి పని సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. చాలా గ్రీవెన్స్‌స్ ఇప్పటికి పరిష్కారం కాని స్థితి ఉందన్నారు. రోష్టర్ పాయింట్ ఆధారంగా సీనియారిటి పై గ్రీవెన్స్‌స్, ఇతర అప్పీల్స్ ఉన్నాయన్నారు. కావున మండలస్థాయి సర్దుబాటు అయిన తర్వాత డివిజన్ స్థాయి సర్దుబాటు చేయాలని వారు కోరారు.

శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు

బాపట్ల, ఆగస్టు 27 : పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం హిందుసేన ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు కార్యక్రమం చేసి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని యువత ఆనందోత్సవాలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు నాళం నరేష్, వక్కలగడ్డ విష్ణు, చందోలు శ్రీనాథ్, వక్కలగడ్డ పవన్, సాయి, అఖిల్ భక్తులు పాల్గొన్నారు.

● అమృతలూరు, ఆగస్టు, 27 : మండల పరిధిలోని యడవూరులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలో అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని కరేటి దమయంతి, లక్ష్మీపతి, జడ కాళికాంబ, సాంబశివరావు, అప్పారావుల స్మారకార్థం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వైద్యసేవలందించారు. సాయంత్రం చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాట్లను బొంతా ఆంజనేయులు, రామకృష్ణ, తాడిబోయిన కోటేశ్వరరావు, కె.అంకమ్మరావు, సాయికృష్ణ, వెంకట్రావు, బి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావుకు జాతీయ అవార్డు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 27 : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావుకు మదర్‌థెరిస్సా జయంతి వేడుకలలో భాగంగా మదర్ సర్వీస్ సొసైటీ రెండో వార్షికోత్సవం పురస్కరించుకొని సొసైటీ ఫౌండర్ డాక్టర్ మల్లాది ప్రసాదరావు ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు 2024ను ప్రదానం చేశారు. విజయవాడ హనుమంతరాయ్ గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సినీనిర్మాత డాక్టర్ ఎండీ మోసా ఆలీఖాన్, సినీ యాక్టర్ కందేటి శ్రీనివాసరావు, పలువురు ప్రముఖుల చేతులమీదగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. భారతదేశంలో 7 రాష్ట్రాలకు చెందిన 140 మంది ప్రముఖులకు ఈ అవార్డు అందజేసినట్లు శ్రీనివాసరావు చెప్పారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన మదర్‌థెరిస్సా ఫౌండర్, అధ్యక్షులు మల్లాది ప్రసాద్‌కు, మనం ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చక్రవర్తిలకు ఆయన అభినందనలు తెలిపారు.

పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల ప్రతిజ్ఞ

బాపట్ల, ఆగస్టు 27 : నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

- హాజరైన ఎమ్మెల్యే వేగేశన, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్

బాపట్ల, ఆగస్టు 27 : పట్టణంలోని దర్శిపెదమస్తాన్ నగర్‌లో ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో మంగళవారం కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం గోపూజ, చతుర్వేద పారాయణం, 12 జీవనదుల జలాలతో అభిషేకం, తదుపరి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ పార్టీశ్రేణులతో కలిసి వేడుకలలో పాల్గొని పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం, నగరోత్సవం చేశారు. ఆయా కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు తోట నారాయణరావు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, బండి శ్రీనివాసరావు, ఫరీద్‌మస్తాన్, రమాదేవి, కిషోర్, సోమయ్య, కుర్రా ధనేంద్ర, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, సోమయ్య, శేఖర్, ఆడే వంశీ, ఐనంపూడి షాలెంరాజు, వడ్లమూడి నాగరాజు, రాజేంద్ర పాల్గొన్నారు.


దర్శిపెదమస్తాన్ నగర్‌లోని శ్రీ రుక్మిణి సత్యభామసమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


వేణుగోపాలస్వామి దేవాలయంలో పార్టీశ్రేణులతో కలిసి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ, బీజేపీనాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

పేదల నివేశన స్థలాలు ఆక్రమిస్తే సహించం : ఆర్డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెరుకుపల్లి, ఆగస్టు 27 : ప్రభుత్వం పేదలకు నివేశనస్థలాలు అందించిన ప్లాట్లను ఆక్రమించుకుంటే సహించేది లేదని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. చెరుకుపల్లిలోని జగనన్న కాలనీల్లో పలువురు రైతులు పశువుల మేత, వరిసాగు చేసిన ప్లాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. జగనన్న కాలనీలో ఆక్రమణలకు గురైన ప్లాట్లు అని మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించి చెరుకుపల్లిలోని జగనన్నకాలనీలోని ప్లాట్లను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో ఎవరూ పశువుల గడ్డి, వరినాట్లను వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాట్లు, పశువుల మేత వేసిన ప్లాట్లను ట్రాక్టర్ ద్వారా దుక్కి దున్నించారు. మండలంలో ప్రభుత్వం అందించిన ప్లాట్లలో ఎవరైన అక్రమంగా ఆక్రమించుకుంటే ప్రభుత్వం శిక్షిస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ పద్మావతి, ఆర్ఐ మౌనిక, వీఆర్వో నాగరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో ఆక్రమణలకు గురైన ప్లాట్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో హేలా షారోన్ తదితరులు

ఎస్వీఆర్ఎం కళాశాలకు పుస్తకాలు అందజేత

నగరం, ఆగస్టు 27 : విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నీట్ జేఈఈ మెయిన్స్ మొదలైన పరీక్షలకు సంబంధించిన రూ.50 వేల విలువ చేసే పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మంగళవారం కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరికి అందజేశారు. కరస్పాండెంట్ బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ సహృదయంతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనగాని హరికృష్ణ రూ.50 వేల విలువ చేసే వివిధ రకాల పుస్తకాలను లైబ్రరీకి అందజేయటం అభినందనీయమన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే దిశగా ఆయన ముం దుకు రావటం సంతోషకరమన్నారు. ఈ పుస్తకాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కోచింగ్ తీసుకునే విద్యార్థులకు ఈ పుస్తకాల ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారాయణ, సూపరింటెండెంట్ అమిరేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అనగాని శ్రీనివాసరావు, సంగం డెయిరీ డైరెక్టర్ ఎస్‌వీకే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


బుచ్చయ్యచౌదరికి పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ

సెల్ టవర్ నిర్మాణం చేయొద్దని వినతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 27 : అద్దేపల్లిలోని ఫెయిత్ టెంపుల్ వెనుక నిర్మిస్తున్న ప్రైవేట్ 5జి సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని గ్రామస్థులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇచ్చిన జీవో 334, 1994లో చట్టంలో చేసిన నిబంధనలు ప్రకారం స్థానిక పంచాయతీ అనుమతి లేకుండా, సెల్ టవర్ నిర్మాణం సమీపాన ఉన్న ఇంటి యజమానుల అనుమతి లేకుండా గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నా అక్రమంగా నిర్మిస్తున్నారన్నారు. ఈ సెల్ టవర్ ఇళ్ల మధ్యలో ఉండటం వలన ప్రజలు అనేక రోగాలకు గురయ్యే ప్రమాదం చెప్పారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, దానియేలు, కిరణ్, ఏసోబు, ఎలీషా, జార్జి, ప్రతాప్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్

కౌలు రైతును గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

కొల్లూరు, ఆగస్టు 27 : కౌలు రైతును గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ అర్జున్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చుండూరు మండలానికి చెందిన తొలుచూరి శివాజీ కొల్లూరులో పొలం కౌలుకు చేస్తున్నాడు. ఆ పొలానికి సోమవారం మందులు పిచికారీ చేయిస్తుండగా కొల్లూరు మండల పరిధిలోని పెసర్లంక గ్రామానికి చెందిన తాతా శివప్రసాద్ అనే వ్యక్తి అక్కడకు వెళ్లి మా పొలంలో నీకేం పని అనగా పొలం కౌలుకు తీసుకున్నానని చెప్పడంతో ఆగ్రహించిన ప్రసాద్ కౌలు రైతును క్రికెట్ బ్యాట్‌తో కొట్టి గాయపరిచాడు. పైగా అతనిని అక్కడే కొంతసేపు కదలనివ్వకుండా నిర్బంధించాడు. తరువాత తగిలిన గాయాలకు చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు వెళ్లి అక్కడ నుంచి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కౌలు రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

వేమూరు ఆగస్టు 27 : మండలంలోని జంపని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకులుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఎం.శిరీష తెలిపారు. యోగాలో పీజీ, డిగ్రీ, డిప్లమో చేసి అనుభవం గల అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా శిక్షకులను నియమిస్తామన్నారు. అర్హత కలిగి ఆసక్తి కలిగిన వారు ఈనెల 30వ తేది ఉదయం 11 గంటలలోపు తమ దరఖాస్తులను జంపని ఆయుర్వేద వైద్యశాలలో అందించాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 8885483408ను సంప్రదించాలన్నారు.

అన్నక్యాంటిన్‌లో ఉచిత భోజనం


అన్నక్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న దాతలు

బాపట్ల, ఆగస్టు 27 : పట్టణంలోని అన్నక్యాంటిన్‌లో ధిరిశాల రాఘవయ్య ఆర్థిక సహకారంతో మంగళవారం పేదలకు ఉచితంగా భోజనం అందజేశారు. రాఘవయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పేదలకు 5 రూపాయలకే మంచి ఆహారం అందించటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సత్యశోధన సంస్థ కార్యదర్శి రౌతు వేణుగోపాల్, తమలపాకుల భాస్కరరావు, ముత్యాల రామకృష్ణ, డి.రమేష్, బండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిండైట్ ఫ్యాక్టరీలో ఆకస్మిక తనిఖీ

కమిటీ అనుమతి లేకుండా ఎలా నడుపుతారని నిలదీత



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అధికారులు

మేదరమెట్ల, ఆగస్టు 27 : మేదరమెట్లలోని సిండైట్ ఫ్యాక్టరీలో పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో మిరపకాయలు పొడి చేసే యూనిట్ నడపం పట్ల ఈఈ రాఘవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ నియమించిన కమిటీ ఆదేశాలు లేకుండా ఎలా నడుపుతారని ఆయన ప్రశ్నించారు. ట్రైయిల్ రన్ మాత్రమే చేస్తున్నామంటూ ఫ్యాక్టరీ అధికారులు అధికారులకు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మిరపకాయలు పొడి చేసే బాయిలర్ యూనిట్‌ను పరిశీలించారు. అక్కడ కొత్తగా చేస్తున్న నిర్మాణాలను గురించి అధికారులు వివరించారు. మిరపకాయలు పొడి చేసే యూనిట్ నుంచి బయటకు వచ్చే గాలిని గతంలో గాలిలోకి వదిలేసేవారు. ఇటీవల కమిటీ సందర్శించిన తరువాత అక్కడ చేస్తున్న కొత్త నిర్మాణాలను అధికారులకు వివరించారు. గాలిలోకి కలువకుండా ఆ యూనిట్ నుంచి వచ్చే వ్యర్థాలను అక్కడ ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్‌లలోకి పెట్టిన విధానాన్ని చూపించారు. కమిటీ అనుమతి లేకుండా మిరపకాయలను పొడిచేసే విభాగాలను నడపడానికి వీలు లేదని రాఘవరెడ్డి ఆదేశించారు. అక్కడ పెద్ద మొత్తంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న మిరపకాయల పొడి ఉండడం ఫ్యాక్టరీ నడుస్తున్నదానికి నిదర్శం. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరావుతో పాటు ఆర్ఐ పోతురాజు, వీఆర్‌వో రాజశేఖర్‌రెడ్డి, సిండైట్ అధికారులు పాల్గొన్నారు.

కావాల్సింది ప్రక్షాళనే!

నగరంలో చెత్త ఎత్తరు.. చీపురు పట్టరు..

అక్రమ కట్టడాలకు టౌన్'ప్లానింగ్'

రెవెన్యూలో అవినీతి జలగలు.. నీటి సరఫరా అస్తవ్యస్తం..

సిబ్బందిని ఇబ్బంది పెడుతున్న లీకులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 27 : ఒంగోలు నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన ఫలితంగా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ప్రతి పనికి మామూళ్లు నడిచాయి. పౌరులకు పారదర్శక సేవలు ఐదేళ్ల నుంచి దూరమయ్యాయి. ఒక్కమాటలో చెప్పుకుంటే ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ వాసన ఇంకా పోలేదనే చెప్పొచ్చు. ముఖ్యంగా పారిశుధ్య విభాగంలో పేరుకు కార్మికులు 650 మంది వరకు ఉన్నా, సగం మంది చీపురు పట్టరు, చెత్త ఎత్తరు. అయితే అటెండర్లుగా, మేస్త్రీలుగా చెలామణి అవుతూ వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. దీంతో నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం పనిచేసేవారు కరువయ్యారు. దీంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి.

రెవెన్యూ అంటేనే అవినీతి

ఇదిలా ఉంచితే రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు ఆర్ఐలు వైసీపీ పెద్దల అండదండలతో ఆ సీట్లు దక్కించుకున్న విషయం తెలిసిందే. అలాగే ఇష్టారీతిన ఇంటిపన్నులు వేసి వేలల్లో వసూలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంచితే, అడిగినంత ఇవ్వకుంటే ప్లాను ఉన్నా అనధికార కట్టడంగా మార్చేసి ఇంటి యజమానికి చుక్కలు చూపించడం ఆనవాయితీగా మారింది. మరికొందరు వైసీసీ పెద్దల ఆశీస్సులతో వారి చెప్పినంత ముట్టజెప్పకుంటే నెలలు గడిచినా పన్ను వేసే పరిస్థితి లేదు. మరోవైపు టౌన్ ప్లానింగ్‌లో ఇష్టారాజ్యమై పోయింది. ప్లాన్ ఇవ్వాలంటే పైసలు చెల్లించాల్సిందే. కార్యాలయంలోని కొందరు సిబ్బంది ఆశీస్సులు ఉంటే ప్లాను లేకపోయినా పక్కాగా భవనాలు నిర్మించుకునే పరిస్థితి ఉంది.

అస్తవ్యస్తంగా నీటిసరఫరా, పౌరసేవలు

ఇకపోతే సచివాలయ వ్యవస్థలో ఒక్కో సచివాలయంలో పదిమంది వరకు సెక్రటరీలు ఉన్నారు. నగరంలో 70కిపైగా సచివాలయాలు ఉండగా 700 మంది వరకు సెక్రటరీలుగా ఉన్నారు. అయితే వీరు మాత్రం పౌరసేవల గురించి పెద్దగా పట్టించుకునే పరిస్థితి లేదు. మరోవైపు ఇంజనీరింగ్ విభాగంలో తాగునీటి సరఫరాపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లీకుల మోత, మోటార్ల మరమ్మతులు, ఇంకా పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల కొరత ఇలా రోజుకో సమస్యతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. కాగా ప్రభుత్వం మారింది, పాలకులు మారారు కానీ కార్పొరేషన్ సిబ్బంది పనితీరు మారలేదని కార్యాలయ పరిస్థితి చూస్తే అర్థమవుతుంది.

అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిందే

ఇప్పటికైనా ప్రతి సెక్షన్‌లోనూ మార్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. నగర ప్రజలు సైతం సమగ్ర ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అవినీతికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. కాగా నగర కమిషనర్‌గా కోడూరి వెంకటేశ్వరరావు నేడు బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో పారిశుధ్యం విభాగంలో పూర్తిస్థాయిలో కార్మికులను పనికి కేటాయించాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో తిష్టవేసి, పనిచేయకుండా పెత్తనం చేయడానికి, మొక్కుబడి సేవలకు పరిమితమైన వారిని ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు. అలాగే తాగునీటి సరఫరాలో లోపాలను సవరించి, సక్రమంగా నీరు అందించేలా చూడాలని కోరుతున్నారు. మరోవైపు కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగా ఉన్న రెవెన్యూ విభాగంలో 'గూడు'పుఠానికి తెర తీసిన అవినీతి ఆర్‌ఐలను తొలగించి, పారదర్శక సేవలు అందించాల్సిన అవసరం కనిపిస్తోంది. నగరంలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నేడు కమిషనర్‌గా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ఒంగోలు నగర నూతన కమిషనర్‌గా కోడూరి వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. నరసాపురం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఒంగోలుకు బదిలీ చేసింది.

లోగ్రేడ్.. నోబిడ్...!

నాణ్యత తక్కువ పొగాకు ధరలు పతనం

కిలోకు రూ.50 వరకూ కోత

మేలురకం ధరలపై సీలింగ్

ఉత్పత్తి తగ్గిన రైతులు ఆందోళన

టంగుటూరు, కొండపిలలో వేలాన్ని పరిశీలించిన బోర్డు చైర్మన్, అధికారులు

పొగాకు రైతుల ఆనందం అంతలోనే ఆవిరైంది. మార్కెట్ ప్రారంభం నుంచి ఉన్న ధరలు ప్రస్తుతం దిగజారాయి. కేంద్ర వాణిజ్యశాఖ నుంచి అదనపు పొగాకు విక్రయాలకు అనుమతులు వచ్చిన దగ్గర నుంచి లో, మీడియం గ్రేడ్‌ల ధరలకు భారీగా కోతపడ్డాయి. మేలు రకం పొగాకు కూడా ధర తగ్గింది. లోగ్రేడ్ రకం పొగాకు అయితే ఏకంగా కేజీకి రూ.10పైనే తగ్గింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అపరాధ రుసుం లేకుండా పోయిందన్న పొగాకు రైతుల సంతోషంపై వ్యాపారులు లోగ్రేడ్ ధరల రూపంలో నీళ్లు చల్లారు. ఈ ప్రభావం వచ్చే సీజన్ సాగుపై కూడా పడింది. పొలాల కౌలు, బ్యారన్ అద్దెలు, కూలీల వేతనాల విషయంలో రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.



వేలంలో పాల్గొన్న అధికారులు

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ల ముగింపు దశలో ధరలు బాగా ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆయా గ్రేడ్లకు లభిస్తున్న ధరలను చూసి వారు ఆందోళన చెందుతున్నారు. ఏ ఒక్క గ్రేడ్‌కూ గతంలో ఉన్న ధరలు లభించడం లేదు. లోగ్రేడ్ ధరలు పతనమవడంతోపాటు నోబిడ్లు భారీగా ఉంటున్నాయి. అధికంగా పండిన ఎఫ్-5 రకంలో గ్రేడ్ ధరలు గత నాలుగైదు రోజులుగా కిలోకు సగటున రూ.50 వరకూ తగ్గిపోయాయి. అలాగే మేలురకం ధరలపైనా వ్యాపారులు సీలింగ్ పెట్టి కొనుగోలు చేస్తున్నారు. అధిక పంట ఉత్పత్తికి అపరాధ రుసుం రద్దుతో కొంత ఊరట కలుగుతుందని భావించిన రైతులు ధరల తగ్గుదలతో దిగాలు పడుతున్నారు. అధిక ఉత్పత్తిపై అపరాధ రుసుం తగ్గింపు ఉత్తర్వుల అనంతరం ధరలు పడిపోయాయి. అంతకు ముందు గ్రేడ్ ఏదైనా రేటు ఒకటే అన్న విధంగా మార్కెట్ సాగింది. మేలు, మీడియం రకం ధరలు కిలో రూ.360 నుంచి రూ.380 వరకు కూడా పలికాయి. అధికశాతం ఆ గ్రేడ్ల ధరలు కిలో రూ.350పైనే ఉండగా లోగ్రేడ్‌ను సైతం కిలో రూ.270 వరకూ చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు.

భారీగా తిరస్కరణలు

ప్రస్తుతం మార్కెట్‌లో నాటి ధరలు దక్కకపోవడమే కాక పలు వేలంకేంద్రాలలో లోగ్రేడ్ బేళ్లు భారీగా తిరస్కరణ (నోబిడ్)లు జరుగుతున్నాయి. నెలక్రితం వరకూ మార్కెట్‌లో ధరలు బాగా లభించడంతోపాటు నోబిడ్ బేళ్లు రెండు, మూడు శాతం కూడా ఉండేవికావు. అలాంటిది వారం నుంచి మార్కెట్‌లో ధరలు తగ్గడంతోపాటు నోబిడ్‌లు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకూ దక్షిణాది వేలం కేంద్రాల్లో సుమారు 119 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.263 ధర లభించింది. సగటు ధర గతంలో పోల్చితే అధికంగానే ఉన్నప్పటికీ నెలక్రితం వరకూ మార్కెట్లో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడంలేదు. మేలురకం గ్రేడ్ బేళ్ల గరిష్ఠ ధర కిలో రూ.360 దాటకుండా వ్యాపారులు సీలింగ్ పెట్టి కొంటున్నారు. అలాగే గతంలో కిలో రూ.300కు అటుఇటుగా ఉన్న మీడియం గ్రేడ్ ధరలు ప్రస్తుతం రూ.260 నుంచి రూ.270లోపు ఉన్నాయి. ఇక అధికంగా పండిన లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే ఎఫ్5 రకం ధర కిలోకు రూ.50 మేర తగ్గింది. గతంలో ఈరకం ధర కిలో రూ.260పైనే ఉండగా ప్రస్తుతం రూ.205కు కొంటున్నారు. ఆ ధరకు కూడా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోతుండటంతో నోబిడ్‌లు భారీగా పెరుగుతున్నాయి.

డోలాయమానంలో రైతులు

పొగాకు పెట్టుబడి వ్యయం కూడా ఇబ్బడి ముబ్బడిగా అవుతోంది. నారు నుంచి ట్రాక్టర్ బాడుగలు, కూలి రేట్లు, పొలాల కౌళ్లు, బ్యారన్‌ల అద్దెలు భారీగా పెరిగాయి. మంచి ధరలు లభిస్తుండటంతో రైతులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుత సీజన్‌లో కూడా ఇటీవల వరకూ రికార్డు స్థాయి ధరలు లభించాయి. వాటిని చూసి వచ్చే సీజన్‌కు రైతులు ముందస్తుగాకు పొగాకు పొలాలు, బ్యారన్‌లు లీజుకు తీసుకన్నారు. ఎకరా పొలం కౌలు రూ.25వేల నుంచి రూ.35 వేల వరకూ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. బ్యారన్‌లను కూడా రెండున్నర లక్షల రూపాయల వరకు లీజుకు ముందుగానే తీసుకున్నారు. ఈదశలో గడచిన నెలరోజులుగా పొగాకు ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తీసుకున్న పొలాల విషయంలో డోలాయమానంలో పడ్డారు. కౌలుకు ఇచ్చిన రైతులు కూడా ధరలు తగ్గిస్తున్నట్లు సమాచారం.

ఎక్కువగా లోగ్రేడే వెనక్కి.

జిల్లాలో సోమవారం మార్కెట్‌ను పరిశీలిస్తే ఒంగోలు-1 కేంద్రానికి 1,540 బేళ్లు రాగా 1,229 కొనుగోలు చేశారు. అక్కడ 291 బేళ్లు నోబిడ్ అయ్యాయి. ఒంగోలు-2కు వెయ్యి బేళ్లు రాగా 170, టంగుటూరుకు 951 బేళ్లు రాగా 135, కొండపి కేంద్రానికి 1,085 బేళ్లు రాగా 206 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. పొదిలిలో హమాలీల కొరతతో 278 బేళ్లు మాత్రమే అనుమతించగా 32ను తిరస్కరించారు. తిరస్కరణలు జరుగుతున్న బేళ్లలో 95శాతం వరకు లోగ్రేడ్ ఉంటున్నాయి. ఇదిలా ఉండగా ధరలు తగ్గిన నేపథ్యంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ ఈ సోమవారం కొండపి, టంగుటూరు వేలంకేంద్రాలను సందర్శించారు. అక్కడ కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా లోగ్రేడ్ ధరల తగ్గుదల విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లి ధరలు నిలకడగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం మీద వేలం ముగింపు దశ సమయంలో ధరలు పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాగు తగ్గించాలనుకుంటున్నా..:

బొక్కిసం శేషయ్య, కట్టావారిపాలెం, కొండపి మండలం

నేను గత ఏడాది 18 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. కూలీల కొరత కూడా ఉంది. ఈ సంవత్సరం ఇప్పటికే పచ్చాకు ముఠాలకు రూ.5వేలు అడ్వాన్స్ కూడా చెల్లించా. అదేసమయంలో ప్రస్తుతం వేలం కేంద్రాల్లో ధరలు కూడా పడిపోయాయి. ఈ పరిణామాలతో వచ్చే సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గించి బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండించాలని నిర్ణయించుకున్నా.

పునరాలోచనలో పడ్డా

కొత్తపల్లి వెంకటేశ్వర్లు (గుణ), జమ్ములపాలెం

నేను గత ఏడాది 25 ఎకరాల్లో పొగాకు పండించా. అధికారిక పంట కొనుగోళ్ల సమయంలో మంచి ధరలు లభించాయి. దీంతో వచ్చే సీజన్‌లో సాగుకు ఇప్పటికే కొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నా. అదనపు పంట కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ధరలు పడిపోతున్నాయి. మరికొన్ని పరిణామాలు కూడా మున్ముందు మార్కెట్‌పై అనుమానాన్ని రేకెత్తిస్తున్నాయి. దీంతో వచ్చే సీజన్‌లో సాగుపై పునరాలోచనలో పడ్డా.

సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27: సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుపై సంబంధిత అధికారులతో జరిగిన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పథకం ఉద్దేశాలు, లక్ష్యాలు, గృహాలు, కార్యాలయాలు, పరిశ్రమలలో సౌర విద్యుత్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. దాని ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలను, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెం, తాళ్లూరు మండలం తూర్పుగంగవరం, పామూరు మండలం కంబాలదిన్నె, మార్కాపురం మండలం వేములకోట, జరుగుమల్లి మండలం పాలేటిపాలెంలను ఈ పథకం కింద మోడల్ గ్రామాలుగా ఎంపికచేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామాల్లో సత్వరమే సౌర విద్యుత్ వ్యవస్థను విస్తృతస్థాయిలో అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపైనా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు కూడా త్వరగా జమచేసేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి ఈ పథకంపై సమీక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎల్‌డీఎం డి.రమేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జడ్పీ సీఈవో మాధురి పాల్గొన్నారు.

ఒంగోలులో సర్దుబాటు రీకౌన్సెలింగ్

36 స్థానాలు భర్తీ, 12 మంది మిగులు టీచర్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 27: ఒంగోలు మండలంలో టీచర్ల పని సర్దుబాటు కౌన్సెలింగ్ మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయ ఆదేశాల మేరకు మంగళవారం ఉపాధ్యాయులకు మళ్లీ రీకౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేశారు. మిగులు టీచర్ల సీనియార్టీ జాబితాలో ఒక టీచర్ సీనియార్టీ విషయంలో వచ్చిన వివాదం పెద్ద దుమారం రేగింది. దీంతో మిగులు టీచర్లకు మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీస్థానాలను సర్దుబాటు చేశారు. ఒంగోలు మండలంలో 48 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలగా 37 స్థానాల్లో అవసరమని గుర్తించారు. మొదట జరిగిన కౌన్సెలింగ్‌లో 34 స్థానాలు భర్తీ కాగా 14 మంది మిగిలారు. అయితే సీనియార్టీ జాబితాలో తదితర 14 అంశాలపై టీచర్లు మళ్లీ గ్రీవెన్స్‌లో పెట్టారు. వాటిలో కేవలం మూడు మాత్రమే పరిష్కారం కాగా, మిగిలిన 11 అంశాలను తిరస్కరించారు. ఈ నేపథ్యంలో మొదట కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలకు అందరూ అంగీకరించారు. అయితే గణితం అసిస్టెంట్ ఒకరు తనకు సీనియార్టీలో అన్యాయం జరిగిందని, తనకంటే జూనియర్‌ను జాబితాలో సీనియర్‌గా చూపించారని విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీనియార్టీ తేడాపై డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నోడల్ ఆఫీసర్, ఆర్‌జేడీలు కూడా రంగంలోకి వచ్చారు. ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్‌బాబు సీనియార్టీ విషయంలో తన తప్పిదం లేదని, తాను పెట్టిన గ్రీవెన్స్ వాట్సాప్ మేసేజ్‌లు చూపించి ఉన్నతాధికారులను ఒప్పించారు. దీంతో ఫిర్యాదుచేసిన టీచర్‌కు న్యాయం చేసే విషయంలో మళ్లీ రీకౌన్సెలింగ్ నిర్వహించమని ఎంఈఓను ఆదేశించారు. దీంతో ఆయన కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేశారు. తాజా సర్దుబాటులో 48 మంది మిగులు టీచర్లలో 36మంది స్థానాలు కోరుకోగా 12మంది మిగులుగా తేలారు. స్కూలు అసిస్టెంట్ హిందీ ఒక స్థానం భర్తీకాకుండా మిగిలిపోయిందని ఎంఈఓ కిషోర్‌బాబు తెలిపారు

ముగిసిన బదిలీల దరఖాస్తుల స్వీకరణ

ఏ గ్రేడ్ కార్యదర్శులను ఆ గ్రేడ్‌లోనే నియమించాలని అధికారులు ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27 : జిల్లా పంచాయతీ కార్యాలయంలో బదిలీల దరఖాస్తుల గడువు స్వీకరణ మంగళవారంతో ముగిసింది. పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 31లోపు బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకనుగుణంగా పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు జిల్లా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుత బదిలీల్లో ఏ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులను ఆ గ్రేడుల్లోనే నియమించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో సందిగ్ధం నెలకొంది. కొంతమంది కార్యదర్శులు తమకు అనుకూలమైన పంచాయతీల కోసం ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు చేయించుకోవడంతో ప్రతిష్టంభన నెలకొంది. జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు నాలుగు గ్రేడ్‌లుగా ఉన్నారు. మొదటి గ్రేడ్‌లో మేజర్ పంచాయతీలు ఉండగా మిగిలిన గ్రేడ్‌లు ఆయా పంచాయతీల స్థాయిని బట్టి ఉన్నాయి. అయితే ప్రస్తుతం కొంత మంది గత వైసీపీ ప్రభుత్వంలో గ్రేడ్-3 వారు కూడా గ్రేడ్-1 పంచాయతీల్లో కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. అటువంటి చోట ప్రస్తుతం ఉన్నతాధికారులు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులను మాత్రమే నియమించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పుడు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

రద్దు కానీ డిప్యుటేషన్లు

కాగా ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పంచాయతీరాజ్‌శాఖలో పనిచేసే ఉద్యోగుల డిప్యుటేషన్లను సంబంధిత అధికారులు రద్దు చేసి వారి పూర్వపు స్థానాలకు పంపాల్సి ఉంది. కానీ ఇంతవరకు ఆ డిప్యుటేషన్లను రద్దుచేసిన పరిస్థితి లేకుండాపోయింది. జిల్లా పంచాయతీ కార్యాలయంతో పాటు జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో సుమారు 60 మంది కార్యదర్శులు, సిబ్బంది డిప్యుటేషన్లపై కొనసాగుతున్నా వాటిని రద్దు చేయకపోవడంపై పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మొక్కులు తీర్చుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



దర్గా వద్ద నేతలు

తర్లుపాడు, ఆగస్టు 27: తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు దర్గాలో ప్రసిద్ధి గాంచిన కాశింస్వామికి ఉమ్మడి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తుమ్మలచెరువు దర్గాలో నాయకులు టీడీపీ అఖండ మెజార్టీ సాధించాలని మొక్కుకున్నారు. ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యయాదవ్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్యలు కాశింస్వామికి మొక్కులు తీర్చుకున్నారు

ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

అద్దంకి, ఆగస్టు 27 : ఫ్యాక్టరీలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల అచ్చుతాపురంలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో మండలంలోని విప్పర్లవారిపాలెం వద్ద ఉన్న నీలి ఆక్వా, చినకొత్తపల్లి వద్ద ఉన్న వల్లభ ఫ్యాక్టరీలను మంగళవారం అధికారుల బృందం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి అధికారులు ఫ్యాక్టరీలోని సిబ్బందికి సూచనలు చేశారు. అధికారులు రాఘవరెడ్డి, పరమేశ్వరరావు, మాధవనాయుడు, గీత, గాయత్రీదేవి, శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీచరణ్ ఉన్నారు.

అవార్డుకు ఎంపికైన చందలూరు ఉన్నత పాఠశాల

పంగులూరు, ఆగస్టు 27 : స్పోర్ట్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్‌కు చందలూరు ఉన్నత పాఠశాల ఎంపికైంది. రాష్ట్రంలో మూడు పాఠశాలలను క్రీడా ప్రతిభా అవార్డుకు, 130 పాఠశాలలను జిల్లా క్రీడా ప్రతిభ అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా ప్రతిభ అవార్డుకు బాపట్ల జిల్లా పరిధిలో ఎంపికైన 5 పాఠశాలల్లో చందలూరు ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు హెచ్‌ఎం గిరిజ తెలిపారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ పుట్టిన రోజు సందర్భంగా 29 నేషనల్ స్పోర్ట్స్ డేని పురస్కరించుకుని క్రీడా ప్రతిభా అవార్డులలో చందలూరు పాఠశాలకు స్థానం లభించిందన్నారు. ప్రతిభ అవార్డుకు కృషి చేసిన పీడీ ప్రతిమను హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాది రఫీ

అద్దంకి, ఆగస్టు 27 : రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది షేక్ మహ్మద్ రఫీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్య పోక్సో యాక్ట్ తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రకాష్, హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

చినగంజాం, ఆగస్టు 27 : భూ సమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆమరా కుటుంబీకులు పూజలు చేశారు. ఆలయ అర్చకుడు మోహనలక్ష్మీనరసింహాచార్యులు శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహానికి విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్వామిని ఊరేగించారు. పాటలు, క్విజ్ పోటీలను నిర్వహించి బాలబాలికలకు బహుమతులు అందజేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం వేడుకను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.





ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న గుంటుపల్లి మేజర్ కాలువ పనులు.. అభివృద్ధి అనంతరం అంబడిపూడి వద్ద కాలువ ఇలా

గుంటుపల్లి కాలువకు మహర్దశ

- మంత్రి గొట్టిపాటిని కలిసి సమస్యను వివరించిన నాలుగు గ్రామాల రైతులు
- తక్షణమే మేజర్ అభివృద్ధికి శ్రీకారం
- అన్నదాతల హర్షం

బల్లికురవ, ఆగస్టు 27 : ఎన్నో ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని గుంటుపల్లి మేజర్ కాలువకు మహర్దశ పట్టింది. అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి చీలే గుంటుపల్లి మేజర్ కాలువ ద్వారా పెద అంబడిపూడి, చిన అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ గ్రామాలలోని మూడు వేల ఎకరాలకు పైబడి పంటలకు సాగు నీరు చేరాల్సి ఉంది. ప్రతి సారీ సాగు కోసం నీటిని విడదల చేసిన సమయంలో దిగువ ఉన్న భూములకు నీరు అందే పరిస్థితి లేదు. ఈ ఏడాది అన్ని డ్యాంలు నిండి వరి సాగుకు కూడా నీరు విడదల జరుగుతుండడంతో రైతులు ఎంతో ఉత్సాహంతో పంటల సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దశలో గుంటుపల్లి మేజర్ కాలువ దట్టమైన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. దీంతో రైతులు పంటల సాగుకు నీరు వచ్చిన ఉపయోగం లేదని, తక్షణమే మేజర్ కాలువను అభివృద్ధి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. అయన స్పందించి ఎన్ఎస్పీ అధికారులతో మాట్లాడారు. వెంటనే గుంటుపల్లి మేజర్ కాలువను అభివృద్ధి చేయించాలని ఆదేశాలు ఇచ్చారు. గత రెండు రోజుల నుంచి అంబడిపూడికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు దద్దాల అంజయ్య పర్యవేక్షణలో మేజర్ కాలువ పరిధిలో ఉన్న ఏడు కిలోమీటర్లను పూర్తి స్థాయిలో రెండు ఎక్స్‌కవేటర్లతో అభివృద్ధి పనులను చేస్తున్నారు. అంబడిపూడి గ్రామం వద్ద కాలువలో పూడిక తీయడంతో కాలువలో నీటి ప్రవాహం చూసి రైతులు ఆనందపడుతున్నారు. మేజర్ కాలువలో ఉన్న పూడికతో పాటు తుమ్మ చెట్లను తొలగించి బయట పడవేయడంతో నీరు దిగువ భూములకు కూడా సకాలంలో చేరుతుందని రైతులు అంటున్నారు. ఏబీసీ కాలువ తూము నుంచి తక్కువ నీరు వచ్చిన వృథా కాకుండా పంటలకు చేరుతుందని రైతులు తెలిపారు. సకాలంలో మేజర్ కాలువ అభివృద్ధి పరచడం పట్ల నాలుగు గ్రామాలకు చెందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ కాలువ బాగు చేయడంతో రైతులు సొంతంగా చందాలు వేసుకొని మైనర్ కాలువలను అభివృద్ధి పరుస్తున్నారు. ఈ ఏడాది పంటలకు సాగు నీరు సకాలంలో అందేలా ముందస్తుగా మైనర్ కాలువలను బాగు చేసేందుకు రైతులు సన్నాహాలలో నిమగ్నమై ఉన్నారు.



గ్రంథాలయ సభ్యత్వ రశీదును అందజేస్తున్న ఆదిలక్ష్మి

గ్రంథాలయంలో తనిఖీ

మార్టూరు, ఆగస్టు 27 : జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి మంగళవారం మార్టూరు శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అక్కడున్న పుస్తకాలను, రికార్డులను పరిశీలించారు. అలాగే విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకోవాలని, పుస్తకాలతో జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. తరువాత విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య ఆర్థిక సహకారంతో 11 మంది బాలికలకు 550 రులు సభ్యత్వరుసుము చెల్లించి వారికి రశీదులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేశ్వరరావు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండల కేంద్రమైన సంతమాగులూరు గ్రంథాలయంలో మంగళవారం 2023-2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఒంగోలుకు చెందిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలో సభ్యత్వం కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుబ్బారావు, గ్రంథ పాలకులు. బాదం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎంవోయూ



ఎంవోయూని అందుకుంటున్న సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 27 : తమ కళాశాలలో చదివే విద్యార్థులకు కోర్సు పూర్తయ్యే నాటికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని సెయింట్ ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు ఏపీఐఆర్2 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవారితో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా ఏపీఐఆర్ 2 కంపెనీ ప్రతినిధి గోపాలకృష్ణ (ఫౌండర్), సీఈవోతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, సెక్రటరీ, కరస్పాండెంట్‌లు ఎంఓయు పత్రాలను అందుకున్నారు. తద్వారా విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ అవగాహన ఒప్పందం 10 సంవత్సరాలపాటు కొనసాగుతుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

45 మద్యం బాటిల్స్ స్వాధీనం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 27 : రైల్వేస్టేషన్ సమీపంలోని బాలాజీ నగర్‌లో 45 మద్యం క్వార్టర్ బాటిల్స్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మహిళను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి మంగళవారం ఉదయం పట్టుకున్నారు. కేసు నమోదు చేసి తగిన చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఐ

సభ్యత్వ నమోదులో కీలకపాత్ర పోషించాలి

చీరాల, ఆగస్టు 27 : బీజేపీ సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులు కీలకపాత్ర పోషించాలని బాపట్ల పార్లమెంట్ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ తదితరులు పిలుపునిచ్చారు. రోటరీ కమ్యూనిటీహాలులో మంగళవారం బీజేపీ చీరాల అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్ అధ్యక్షతన సాధారణ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఉందన్నారు. ఆ క్రమంలో పార్టీ సభ్యత్వ నమోదులో అందరిని భాగస్వాములను చేయాలని చెప్పారు. చీరాల పట్టణ, మండల, వేటపాలెం మండల బాధ్యులకు కార్యాచరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్పల వెంకటరమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, వేముల వెంకటేష్, అవ్వారు హనుప్రసాద్, శంకరశెట్టి నాగేశ్వరరావు, జయశంకర్, మనోహరరెడ్డి, శివాజీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, భరణిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమంత్

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల, ఆగస్టు 27 : కొరిశపాడులో కట్టెల ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి చిలకలూరిపేట మండలం బొప్పూడి నుంచి ట్రాక్టర్ కట్టెల లోడుతో కొరిశపాడు వస్తుండగా మండల కార్యాలయం ఎదురుగా ఈ ప్రమాదం జరిగింది. చిలకలూరిపేట మండలం కొత్తరాజుపేటకు చెందిన కూలీ వల్లెపు నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా కట్టెల లోడు కింద చిక్కుకున్న వారిని స్థానికులు కాపాడారు. ఘటనా స్థలానికి కొరశపాడు పోలీసులు చేరుకొని గాయపడిన వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సాగు నీటి కోసం 2న ధర్నా

మార్టూరు, ఆగస్టు 27 : వారబందీ పద్ధతి ద్వారా కాకుండా మాగాణి పంటకు 2వ జోన్‌కు సాగర్ నీరు ఇవ్వాలని కోరుతూ మండల రైతు సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల2న మార్టూరులో ధర్నా కార్యక్రమం నిర్వహించడానికి తీర్మానం చేశారు. మంగళవారం మార్టూరులో రైతు సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. సాంబయ్య అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రకాశం కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు 2వ జోన్‌కు ఆరుతడి పంటలు వేసుకోవడానికి మాత్రమే, అదికూడా వారబందీ విధానం ద్వారా సాగర్ నీరు విడుదల చేస్తారన్నారు. రెండేళ్ల నుంచి మాగాణి పంటలు లేక బియ్యం ధర విపరీతంగా పెరిగాయన్నారు. ఈ ఏడాది మాగాణికి నీరివ్వాలని కోరారు. సమావేశంలో రామకోటేశ్వరరావు, మోహనరావు, వీరవల్లి కృష్ణమూర్తి, హనుమంతరావు, నాగేశ్వరరావు, సూరిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

వంకాయలపాడులో వైద్య శిబిరం

స్పందించిన వైద్య సిబ్బంది

వంకాయలపాడు(ఇంకొల్లు), ఆగస్టు 27 : ఇంకొల్లు మండలం వంకాయలపాడులో విషజ్వరంతో బేతపూడి మరియమ్మ మృతి చెందగా మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 15 మంది సిబ్బంది 5 టీములుగా వైద్య సేవలందించారు. మరోపక్క పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలవలను శుభ్రం చేయించి ఎబేటు చల్లి ఫాగింగ్ చేశారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి అంజలి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్‌లు

- బెంబేలెత్తుతున్న రోగులు
- ఏరియా హాస్పిటల్‌లో బారులు

చీరాలటౌన్, ఆగస్టు 27 : చీరాల మరియు చుట్టు ప్రక్కల వైరల్ ఫీవర్‌లు దడ పుట్టిస్తున్నాయి. మంగళవారం ఒక్కరోజే సుమారు 500 వరకు ఓపీలు చీరాల ఏరియా వైద్యశాలకు వస్తున్నాయి. సాధారణంగా జలుబు, జ్వరంతో ప్రారంభమై రోగం ముదిరి ప్రాణ సంకటంగా మారుతోంది. ఈక్రమంలో ఇప్పటికే చీరాల ఏరియా వైద్యశాలలో 112 మంది మంగళవారం వరకు ఇన్ పేషెంట్‌లుగా ఉన్నారు. అంతేకాకుండా గడిచిన రెండు రోజుల్లోనే ఏరియా వైద్యశాలలో నిర్వహించిన పరీక్షల్లో సుమారు 50 మంది డెంగ్యూ బారిన పడ్డారు. వీరిలో ప్రస్తుతం 7 మంది చిన్నారులు, 5 మంది పెద్దలు అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు. రోగాన్ని ముందుగా గ్రహించలేని ప్రజలు రోగం ముదిరాక ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు పెడుతూ వేలల్లో ఖర్చులు చేస్తున్నారు. ఇదిలావుండగా రోగ నిర్ధారణలో డెంగ్యూతోపాటు లివర్ ఇన్ఫెక్షన్, కామెర్లు కూడా వస్తుండడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవగాహన లేమితో నాణ్యమైన వైద్యం అందకపోతే ప్లేట్‌లెట్స్ తగ్గి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ముందస్తుగా అప్రమత్తం అవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏరియా వైద్యశాలలో నాణ్యమైన వైద్యం



ఏరియా వైద్యశాలలో బెడ్ల సంఖ్య పెంచాం. రోగం ప్రారంభ దశలోనే హాస్పిటల్‌కు చేరి వైద్య పరీక్షలు చేయించుకోవడం క్షేమకరం. ప్రజలకు అన్ని రకాల రక్త పరీక్షలకు ఏర్పాట్లు చేశాం. అలాగే వైరల్ ఫీవర్‌లను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఒళ్లు నొప్పులు, జ్వరం, జలుబు, విరేచనాలు, దగ్గు, వాంతులు వంటివి ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డా.సుభాషిణి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్

ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారుతో మాట్లాడిన రెవెన్యూ అధికారులు
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపడతామని రైతులకు భరోసా

పర్చూరు, ఆగస్టు 27 : వాడరేవు - పిడుగురాళ్ల రహదారి నిర్మాణంలో భాగంగా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలోని లోవెల్ బ్రిడ్జి వద్ద తూములతో ఏర్పాటు చేస్తున్న కల్వర్టు నిర్మాణ పనులపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసారు. జాతీయ రహదారి నిర్మాణం నేపధ్యంలో లోవెల్ చప్టా ప్రాంగణంలో బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కొద్దిపాటి వరదలు వచ్చిన సమీప గ్రామాల్లోని నీటితో పొలాలు ముంపునకు గురిఅవుతాయన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులను నిలుపుదల చేసి చప్టాపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలనానరు. ఈసమస్యను రైతులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. రైతుల సమస్యపై స్పందించిన ఏలూరి నేషనల్ హైవే అధికారులతో పాటు, తహసీల్దార్‌తో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



హైవే అధికారులతో రైతుల సమక్షంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఏలూరి ఆదేశాలతో మంగళవారం నేషలన్ హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్ బ్రహ్మయ్య సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో పంట పొలాలకు, గ్రామానికి ఎలాంటి వరద ముంపు లేకుండా చర్యలు చేపడతామని హైవే అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

చినగంజాం, ఆగస్టు 27 : మండలంలోని పెదగంజాం గ్రామంలోని ఇసుక క్వారీల నుంచి అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మంగళవారం వేకువజామున పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. పెదగంజాం ప్రాంతంలోని ఇసుక క్వారీల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరిలిస్తున్న టిప్పర్లను గ్రామానికి చెందిన ఆసోది వెంకటరమణారెడ్డితో పాటు పలువురు గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గ్రామస్థులు టిప్పర్లను ఆపి, పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి టిప్పర్‌ను, ఇసుక లోడు చేసుకునేందుకు వచ్చిన రెండు టిప్పర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇసుక లోడు చేసుకున్న టిప్పర్‌ను సీజ్ చేసి, టిప్పర్ డ్రైవర్ నాగులుప్పలపాడు మండలం రాపర్ల గ్రామానికి చెందిన పెరికల ప్రవీణ్, టిప్పర్ యజమాని వి. కోటిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆర్టీవోకు ఆ రెండు టిప్పర్లను అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్

గ్రామానికి చెందిన మండల ప్రజాప్రతినిధి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవణా చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలతో గ్రామస్థులకు అవస్థలు

మేదరమెట్ల, ఆగస్టు 27 : మేదరమెట్లలో ఆక్రమణదారులు మరలా రోడ్డెక్కరు. గత డిసెంబర్‌లో రహదారులు భవనాలశాఖ, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు కలిసి మేదరమెట్లలోని పాత జాతీయ రహదారిలో ఆక్రమణలు మొత్తం తొలగించారు. రెండో వాహనం కూడా దుకాణాలను సిమెంట్ రోడ్డు వరకు తెచ్చి పెట్టడంతో వాహనాలు రోడ్డుపై నిలిపి, దుకాణాలకు కొనుగోలు కోసం వచ్చే వాహనాలు నిలడపం వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు దుకాణదారులు రేకులతో సిమెంట్ రోడ్డు వరకు నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు సమస్యగా మారింది. దీనికితోడు షాపు యజమానులు షాపుల ముందు తోపుడు బండ్లకు అద్దెకు ఇవ్వడంతో వారు మరింత ముందుకు రావడం రెండో వాహనం నడపలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అధికారులు అప్పటిలో ఆక్రమణలు మొత్తం తొలగించారు. రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ కాలువ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు చేయించారు. ఈలోగా ప్రభుత్వం మారడంతో రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాలేదు. ఆక్రమ నిర్మాణాలు తొలగించిన 8, 9 నెలలలోనే ఒకొక్కరుగా ముందుకు వచ్చి రేకుల నిర్మాణాలతో షాపులను ముందుకు జరపడంతో, తోపుడు బండ్లలను షాపులముందుకు తెచ్చి పెట్టడంతో సమస్య మొదటికి వచ్చింది. దీనికి తోడు షాపులముందు సిమెంట్ రోడ్డు కన్న ఎత్తుగా మెరకతోలడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. గతంలో అక్రమణలు తొలగించినప్పుడు రోడ్డు కంటే ఎత్తుగా ఉన్న మెరకను తొలగించడంతో వర్షపు నీరు సైడ్ డ్రైన్‌లోకి వెళ్లే మార్గం ఏర్పడింది. మరలా ఇప్పుడు మెరక తోలడం వలన వర్షపు నీరు రోడ్డుపై నిలిచి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఆర్ అండ్‌బీ, పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమణలు తొలగించి మరల ఆక్రమణలు జరగకుండా చూడాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



మేదరమెట్లలో మళ్లీ రోడ్డుపైకి వచ్చిన అక్రమణలు

వైభవంగా మహాలక్ష్మమ్మ సంబరాలు

మార్టూరు, ఆగస్టు 27 : మార్టూరులోని నాగరాజుపల్లి సెంటరులో ఉన్న మహాలక్ష్మమ్మ తల్లి సంబరాలను మంగళవారం సంపత్‌నగర్ వాసులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏటా జరిగే ఆనవాయితీ లో భాగంగా సంపత్ నగర్ కు చెందిన మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో గంపలతో బంతిపూలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మ వారిని బంతిపూలతో అలంకరించారు. దాదాపుగా 30 క్వింటాళ్ల బంతిపూలతో అమ్మ వారికి అలంకరణ చేశారు. అమ్మవారి ప్రాంగణం అంతా విద్యుత్ దీపాలంకరణ చేశారు. తరువాత అమ్మ వారిని సంపత్‌నగర్‌లోని వీధులలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట మహిళలు పెట్టిన పొంగళ్లను అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాలుస్తూ, కాలనీవాసులు అందరూ ఐక్యంగా అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా భక్తులు అమ్మ వారికి తమ మొక్కులను తీర్చుకున్నారు.



బంతిపూల అలంకరణలో మహాలక్ష్మమ్మ